Licenced to Post without Prepayment (AP/VJ-16/WPP/2012-13)

జిమ్మిక్కైతు
పాగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
స్వదేశంలో రూ.200లు
విదేశాలకు రూ.1000లు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి
Longest Living Newspaper in Telugu Journalism
జిమ్మిక్కైతు
సంపుటి: 83 • సంచిక: 36 • 6-9-2013 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-



జరిలంగా రాష్ట్ర విభజన!

రాష్ట్రాన్ని ఏమి చేయబోతున్నది కేంద్ర ప్రభుత్వం? ఈ చిక్కు ముడిని ఎట్లా విప్ప బోతుంది? ఈ ప్రశ్నలకు ఎవరూ సమాధానాలు చెప్ప లేని స్థితి. కేంద్రానికి కూడా జవాబులు దొరకడం లేదు. సీమాంధ్ర ఉద్యమం ఇంత తీవ్ర రూపం దాలుస్తుందని ఎవరూ కల కూడా కనలేదు. ఇన్ని లక్షల మంది జనం వీధులలోకి వస్తారని వూహించలేదు. 35రోజుల నుంచి ఉద్యమం నిరవధికంగా నడుస్తున్నది. ఉద్యోగులు సమ్మెలో వున్నారు. ఆర్టీసి బస్సులు తిరగడం లేదు. ప్రభుత్వ బడులు మూత పడ్డాయి. ప్రతిరోజూ ప్రతి పట్టణంలో ఏదో ఒక ఉద్యమ కార్యక్రమం జరుగుతూనే వుంది. దానివల్ల ట్రాఫిక్ స్తంభించి జనం నానా బాధలు పడుతున్నారు. కానీ ఎవరూ చీకాకు పడడం లేదు. ఏమిటీ గొడవ అని విసుక్కోవడం లేదు. తమ కెదురౌతున్న సమస్యలను కూడా సహనంతో భరిస్తున్నారు. ఉద్యమానికి ఒక నాయకుడు లేడు. ఎవరి నుంచీ పిలుపు లేదు. కానీ ఉద్యమం మాత్రం నడిచిపోతూనే వుంది. తెలంగాణ ఏర్పాటు ఆగదని దిగ్విజయ్ సింగ్ వంటి వారు తరచూ ప్రకటనలు చేస్తున్నారు. సాక్షాత్తు ప్రధానమంత్రి కూడా వెనక్కు తగ్గేది లేదని ఎమ్పీలకు తేల్చి చెప్పాడు. పార్లమెంట్‌లో అల్లరి చేస్తే సస్పెండ్ చేసి, బయట పారేస్తున్నారే తప్ప మరొక ఆలోచనకు అవకాశం వున్నట్లు సూచన ఇవ్వడం లేదు. క్యాబినెట్ నోట్ తయారై పోతున్నదని హోంమంత్రి ప్రకటించాడు.

నిరాశకు చోటు లేదు

మామూలుగా అయితే జరిగేది జరిగిపోతున్నప్పుడు మనం ఉద్యమం చేసి ఏమి ఫలం అనే నిరాశ ఏర్పడాలి. కానీ విచిత్రంగా ఢిల్లీ నుంచి ఎన్ని సూచనలు, సంకేతాలు వస్తున్నా జనం మాత్రం తమ మానాన తాము తమ నిరసన వ్యక్తం చేస్తూనే వున్నారు. ఫలితం కోసం ఎదురు చూడకుండా ప్రతిఘటిస్తున్నారు. పైగా ఈ 35 రోజులలో ఎక్కడా శాంతి నియమాన్ని అతిక్రమించడం లేదు.

ప్రజల కోరిక కాదనగలరా?

ఇంత ప్రజాస్వామ్యయుతంగా కోట్లాది మంది ప్రజలు కోరుతున్న కోరికను కాదని నిర్ణయం తీసుకొనే తప్పు కేంద్రం చేయగలదా? అయితే ఆంధ్రుల కోరిక 35 రోజులదైతే, తెలంగాణ వాసుల గోష్ట 60ఏళ్లకు పైబడింది. గత పన్నెండేళ్లుగా ఇంతకంటే తీవ్రంగా ఉద్యమం చేస్తున్నారు వారు. ఆంధ్ర ప్రాంతంలో ఉద్యమం చేస్తున్న వారిని నీకు సమైక్యాంధ్ర ఎందుకు కావాలి అని అడిగితే స్పష్టంగా సమాధానం చెప్పలేరు. హైదరాబాద్ వదలుకోలేమని మాత్రమే చెప్తారు. కానీ తెలంగాణలో పసిపిల్ల వాడిని కదిలించినా తమకెందుకు తెలంగాణ కావాలో ఆవేదనతో, ఆక్రోశంతో, బాధతో భావోద్వేగంతో గంటల తరబడి మాట్లాడుతాడు. వారి మనసులలో ఆ భావన బలంగా చొచ్చుకపోయి వుంది. దాన్ని చెలింప చేయడం జరిగే పని కాదు.

తెలంగాణ భగ్గుమంటుంది

దాని అర్థం – రాష్ట్ర విభజన మీద కేంద్రం ఏ మాత్రం వెనక్కు తగ్గినా తెలంగాణలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతుంది. ఈసారి దాని తీవ్రత ఏ స్థాయిలో వుంటుందో ఎవరూ వూహించలేకున్నారు. కడలి కెరటం వలె విరుచుక పడే ప్రమాదం వుందని అందరూ అంగీకరిస్తున్నారు.

కేంద్రం తొందర పడిందా?

మరి ఈ సమస్యకు పరిష్కారం? ఎవరికీ అర్థం కావడం లేదు. ఒక రకంగా చెప్పాలంటే కేంద్రం తొందరపడింది. సోనియాగాంధీ తప్పు చేసింది. తెలంగాణ ఇవ్వాలనుకొన్నప్పుడు, నేరుగా ఆ ప్రకటన చేయకుండా ఆ ప్రక్రియ ప్రారంభానికి నాంది పలికి వుండాలి. ఆంధ్ర నుంచి వచ్చే సమస్యలు, అభ్యంతరాల పై చర్చ ప్రారంభించి వుండాలి. చిక్కు ముడులు విప్పడానికి కమిటీలు, గట్రా వేసి వుండాలి. నీళ్లు, నిధులు, ఉద్యోగులు, ఉద్యోగాలు, రాజధాని నగరం వంటి కీలక ప్రశ్నలకు సమాధానాలు వెతికే పనితో రాష్ట్ర విభజన ప్రక్రియ ప్రారంభించి వుంటే, ఆంధ్రలో ఇంత ఉద్యమం చెలరేగే ప్రమాదం జరిగేది కాదు. అందరి దృష్టి ఆ చర్చ మీద వుండేది. తమకేమి కావాలో విన్పించే పనిలో అందరూ నిమగ్నమై వుండేవారు. సోనియా లక్ష్యం – రేపటి ఎన్నికలలో సీట్లు తెచ్చుకోవడం. తెలంగాణ సానుకూల ప్రయత్నాలు చిత్తశుద్ధితో చేయడం ద్వారా ఆ లక్ష్యం కూడా నెరవేరి వుండేది. కానీ ఏకపక్షంగా, నేరుగా, సూటీగా తెలంగాణ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడంతో అపార్థాలు పెరిగాయి. భయాలు ఏర్పడ్డాయి. విభజన వ్యతిరేకులు అడ్డంకులు సృష్టించే అవకాశం కల్గింది.

పునరాలోచన లేకున్నా ఆలోచన మాత్రం తప్పదు

మొత్తం మీద ఇది విప్పలేని చిక్కు ముడి. ముందుపోతే నుయ్యి, వెనక్కు వస్తే గొయ్యి. ఏమి చేసినా నష్టం తప్పదు. ఏమీ చేయకున్నా కష్టం తప్పదు. ఆ బాధ ఢిల్లీ పెద్దలకు కూడా అర్థమైనట్లే కన్పిస్తున్నది. ముందు ఆంటోనీ కమిటీ అన్నారు. ఇప్పుడు మంత్రుల సంఘం అంటున్నారు. రేపు ఇంకేమి చెప్తారో తెలియదు. అంటే, ఈ విషయంలో కేంద్రం పునరాలోచన చేయకున్నా ఆలోచన మాత్రం తప్పదని అర్థం. తెలంగాణ ఇవ్వాలనే నిర్ణయాన్ని మార్చుకోకపోయినా, ఎట్లా ఇవ్వాలి అనే విషయంలో మాత్రం లోతైన పరిశీలన జరపాల్సిన అగత్యం ఏర్పడింది. కేంద్రం అనుకొన్నట్లు 20 రోజులలో క్యాబినెట్ నోట్, నెల రోజులలో అసెంబ్లీ తీర్మానం, రెండు నెలల్లో రాష్ట్ర విభజన, నవంబర్ నాటికి రెండు ప్రభుత్వాలు అనే తేదీలు, గడువులు జరిగే పని కాదు.

సాంకేతిక అడ్డంకులు

ముఖ్యమంత్రి, తెలంగాణ అసాధ్యమనే అభిప్రాయంతోనే వున్నాడు. అంద

కొరవ 14వ పేజీలో

సింహపురి సింహ గర్జన









సమైక్యాంధ్రను కోరుతూ నెల్లూరు ఏసిస్టేడియంలో జరిగిన సింహపురి సింహ గర్జన దృశ్యమాలిక.

పెట్రోల్ కుట్ర

సిరియా మీద బాంబుల వర్షం కురిపించడానికి తహ తహ లాడుతున్నాడు అమెరికన్ అధ్యక్షుడు బరాక్ ఒబామా. ఆయన్ను వెనకేసుకొని వస్తున్నాయి ఫ్రాన్స్, బ్రిటన్ దేశాలు. వారు చెప్తున్న కారణం సిరియా అధ్యక్షుడు బషర్ అస్సద్ తన ప్రజల మీదనే రసాయన ఆయుధాలు వాడుతున్నాడని, దాదాపు 50 పట్టణాలలోని నేల మాలిగళ లలో దాచిన వాటిని ధ్వంసం చేయాలని.

మధ్య ఆసియాలో అపారమైన పెట్రోల్ నిల్వలున్న ముస్లిం దేశం సిరియా. సున్నీల సంఖ్య అధికం. 1971 నుంచి ఆ దేశాన్ని ప్రస్తుత అధ్యక్షుడు అస్సద్ కుటుంబమే పాలిస్తున్నది. ఇటీవలి వరకు అతడిపై అక్కడి ప్రజలలో పెద్దగా వ్యతిరేకత లేదు. కానీ రెండేళ్ల క్రితం అరబ్ దేశాలన్ని టిలో చెలరేగిన పౌర విప్లవాలకు సిరియా కూడా ప్రభావిత మైంది. మరొకప్రక్క గత మూడేళ్ల నుంచి దుర్భర దుర్భిక్షం తాండవిస్తున్నది. త్రాగడానికి నీళ్లు కూడా లేక జనం అల మటిస్తున్నారు. 2011 ఏప్రెల్ నుంచి తన పాలనకు వ్యతి రేకంగా ప్రజలలో చెలరేగిన వ్యతిరేకతను అణిచి వేయడానికి అధ్యక్షుడు అస్సద్ సైనిక ప్రయోగం చేస్తు న్నాడు. దానితో విసిగిపోయిన ప్రజలు సాయుధ ప్రతిఘటనకు దిగారు. ఈ అంత ర్యుద్ధంలో ఇప్పటికి లక్ష మంది వరకు మరణించి వుంటారని అంచనా. 40 లక్షల మంది నిరాశ్రయులైనారు. 20 లక్షల మంది వరకు ఇరుగుపొరుగు దేశాలకు వలస వెళ్లారు. అమె రికా, ఇంగ్లండ్, ఫ్రాన్స్ వంటి పాశ్చాత్య దేశాలు పౌర ప్రతి ఘటనకు సహకారం అందిస్తున్నాయి. అమెరికన్ సైనిక, నిఘా సంస్థలు వారికి ఆయుధాలు, శిక్షణ అందిస్తున్నాయి. ఈ క్రమంలో గత వారం ఒకే నగరంలో దాదాపు 1400 మంది పౌరుల సామూహిక వధ జరిగింది. అధ్యక్షుడు అస్సద్ వీరిని రసాయన ఆయుధాలతో సంహరించాడని అమెరికా ఆరోపణ. కానీ దానికి సరైన ఆధారాలు లేవు. అస్సద్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబెట్టాలని పౌర ప్రతిఘటన దళాలే కావాలని వీరిని చంపారనే వాదన కూడా వుంది. కానీ అమెరికా మాత్రం ఈ దుర్ఘటనను సాకుగా తీసుకొని సిరియా మీద బాంబుల వర్షం కురిపించాలని తహ తహ లాడుతున్నది.

అమెరికా లక్ష్యం – అస్సద్ పాలన అంతం చేయడం. సిరియా, ఇరాన్, ఇరాక్, లిబియా వంటి మధ్య ఆసియా దేశాలను తన కాలి క్రింద చెప్పు వలె వుంచుకోవాలన్నది అమెరికా కుత్సితం. ఐరోపా దేశాలన్నీ పెట్రోల్ అవసరాల కోసం ప్రధానంగా మధ్య ఆసియా దేశాల మీద ఆధారపడక తప్పదు. అందువల్లే వాటి మీద ఆధిపత్యం కావాలి వారికి. ఇరాక్‌ను నాశనం చేసింది అందుకే. ఇరాన్ మీద ఆంక్షలు అందుకే. ఇప్పుడు సిరియా మీద యుద్ధమూ అందుకే. 2007 లోనే బ్రిటీష్ ప్రభుత్వం సిరియాలో అశాంతి సృష్టించడానికి పెద్ద ఎత్తున ప్రయత్నం చేసిందని ఒక నిఘా సంస్థ నివేదిక వెల్లడిస్తున్నది. ఇరాన్ నుంచి ఇరాక్ మీదుగా తన దేశం వరకు ఒక పైప్ లైన్ నిర్మించి, దాని ద్వారా ఐరోపా దేశా లకు గ్యాస్ సరఫరాను సులభతరం చేయాలని అధ్యక్షుడు అస్సద్ ఒక ప్రణాళిక తయారు చేశాడు. ఇది అమలు జరిగితే ఇరాన్, సిరియాలు పెట్రోల్ రాబడిని బాగా పెంచుకొంటా యని ఆర్థికంగా బలపడతాయని అమెరికా భయం. ఈ ప్రాం తంలోని పెట్రోల్ నిల్వలు తమ నియంత్రణలోనే వుండాలని, తమ అవసరాలకు అనుగుణంగా మాత్రమే వ్యాపారం జర గాలని అమెరికా దుష్ట ఆలోచన. అందు కోసమే గత రెండు దశాబ్దాలుగా ఈ దేశా లలో దారుణమైన నరమేధం కొనసాగిస్తు న్నారు పాశ్చాత్యులు.

జమీన్‌రైతు

ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్ ఆయుధాలు తయారు చేస్తున్నాడనే నెపం పెట్టి ఇరాక్ మీద దాడి చేసింది అమెరికా. కొన్ని లక్షల మందిని కిరాతకంగా చంపింది. కానీ చివరకొచ్చే సరికి అక్కడ దీపావళి టపాసుల వంటి బాంబులు కూడా లేవని తేలింది. ఇప్పుడు సిరియా మీద రసాయనిక ఆయుధ బూరద చల్లుతున్నది. అందుకు తగిన సాక్ష్యాలు లేవని ఐక్య రాజ్య సమితి నెత్తీ నోరు మొత్తుకొంటున్నా లెక్క చేయకుండా యుద్ధ సన్నాహాలు చేస్తున్నది. ఇది కేవలం పెట్రోల్ కుట్ర. తాము బలవంతులమన్న దురహంకారం. వరసబెట్టి బలహీన దేశాల మీద అమెరికా ఇట్లా దౌర్జన్యాలకు పాల్పడుతూనే వున్న అంతర్జాతీయ సమాజం ఏమీ చేయలేక పోవడం దురదృష్ట కరం. ఐక్య రాజ్య సమితి నిర్వీర్యం కావడం వర్ధమాన దేశాల భవిష్యత్తుకు మహా ప్రమాదం. భారత్, చైనా, రష్యా వంటి సైనిక సామర్థ్యం వున్న దేశాలు ఐక్యమై అమెరికా దుశ్చేష్టలకు అడ్డు కట్ట వేయకుంటే మానవాళికి చెప్పలేనంత చేటు తప్పదు.

జనవాక్కు

సమైక్యాంధ్ర సరికాదు!

1956 నవంబరుకు పూర్వము హైదరాబాద్ తెలుగు రాష్ట్రంలో లేదు. ముస్లింల ఏలుబడిలో వుండింది. ఈ సమయంలో హిందువులు ఇబ్బందులు పడ్డారు. కమ్యూనిస్టులు తెలంగాణ సాయుధ పోరాటం చేసి రజాకార్ల పీచ మణి చారు. కర్నూలు నుంచి హైదరాబాద్‌కు రాజధానిని మార్చిన తర్వాత హిందూ – ముస్లింలు అక్కడ కలసి జీవించనారంభించారు. కాని తెలంగాణ సంస్కృతి, అక్కడి కట్టుబాట్లకు సీమాంధ్రలోని వ్యవహార శైలులకు చాలా తేడా వుంది. ఇప్పటికైనా సీమాంధ్రులు సొంత రాజధానిని, సొంత వనరులను పెంపొందించు కోవాలి. ఆ దిశగా అడుగులు వేయను ప్రయత్నించాలే తప్ప ఇప్పుడున్న పరిస్థి తుల్లో సమైక్యాంధ్ర కోరడం, ఉద్యమించడం సబబు కాదు.

వాస్తు రామచంద్ర నెల్లూరు

జనాభా పెరుగుదల ఆపాలి!

భారతదేశ జనాభా 120 కోట్లకు చేరుకొంది. 2020 సంవత్సరం నాటికి ఈ జనాభా 145 కోట్లకు చేరగలదని ఇటీవల ఒక అంతర్జాతీయ సంస్థ తేల్చి చెప్పింది. ఇదే నిజమైతే దేశ భవిష్యత్తు భయానకమే కాగలదన్న సత్యం కాదన లేనిది. దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడితే ఆహార ధాన్యాలు, వనరుల వినియోగం, ఇంధన అవసరాలు, విద్యా, వైద్యం, పోషకాహారాల స్థాయి క్రమంగా దిగజారడం తప్పదంటూ వివిధ సర్వేలు చెబుతున్నాయి. అధిక ధరలు, అధిక జనాభాను అరి కట్టే పద్ధతులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించక తప్పదేమో?

పి.అరుణకుమారి నెల్లూరు

నినాదంగా పర్యావరణ రక్షణ!

పర్యావరణ పరిరక్షణ ఒక నినాదంగా, ఫ్యాషన్‌గా మారింది. వర్థమాన సమాజానికి కీలకమైన మౌలిక రంగ సౌకర్యాల రూపకల్పనకు అవసరమైన విద్యుచ్ఛక్తి, నీటిపారుదల, ఓడరేవులు, విమానాశ్రయాలు, జాతీయ రహదా రులు, పర్యావరణం పేరిట మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరోధకంగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. నేటి ఆధునిక సమాజానికి నిత్యావసరంగా మారిన విద్యుత్ అంశంలో బొగ్గు నిల్వలు ఎక్కువగా అటవీ ప్రాంతాల్లో లభ్య మవుతాయి. వీటి త్రవ్వకాల విషయానికి వస్తే పర్యావరణ నిబంధనలు అడ్డు వస్తాయి. ఒకవేళ విదేశాల నుంచి బొగ్గు దిగుమతులు చేసుకొంటే, అధిక ధర లకు కొనుగోలు చేస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ముఖ్యంగా విద్యుత్ ఉత్ప త్తికి జల, వాయు, బొగ్గు, పవన, సౌర అణువులతో కూడిన ఇంధన వనరుల విద్యుచ్ఛక్తి లభ్యమౌతున్నప్పటికీ ఎక్కువ భాగం థర్మల్‌పైనే ఆధారపడవలసి వస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సౌర విద్యుత్ వల్ల విద్యుత్ డిమాండ్‌ను తీర్చలేని పరిస్థితి వుంది. ఈ నేపథ్యంలో సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించి పర్యా

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

10-9-1943
పేజీలు:4 వెల: 0-1-6అణా

కూడులేక బెంగాల్‌లో వందల కొలది చస్తున్నారు

"నానాటికి తీసికట్లు నాగం బొట్లు" అన్నట్టుగా వుంది బెంగాల్ ఆహార పరిస్థితి. గతవారాంతం వరకు కలకత్తాలోను మరికొన్ని ప్రధాన పట్టణాలలోనూ మాత్రమే వెయ్యి మంది అన్నార్తులై ఆలో లక్ష్మణా అని ప్రాణాలు గోల్పోయినట్లు అధికార ప్రకటనల వల్లనే తెలుస్తోంది.

ఫరీద్‌పూర్ జిల్లాలోని మాదరీపూర్ పట్టణంలోనే, మూడు రోజులలో 65గురు మరణించారు. చాంధపూర్, మిద్నాపూర్, ఢాకా జిల్లాలలోను ఇంకెందరో మరణించుతున్నట్లూ, అనాధ ప్రేత సంస్కారాలు విధి విరామం లేకుండా జరుగుతున్నట్లు యింకా వార్తలు వస్తున్నాయి.

కలకత్తా నగరంలో ఐదు రోజులలో 141 మంది మరణించారు రోడ్ల మీద.

బెంగాల్ రాష్ట్రమంతటికీ యింతటి విషమ పరిస్థితి యేర్పడటానికి ప్రధాన కారణం ఆ రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతయేనని కలకత్తా పౌరుల బహిరంగ సభ విస్పష్టంగా చాటగల్గింది. నేటి మంత్రివర్గం అధికారంలోకి వచ్చింది మొదలు, ఇతర ప్రాంతాల నుంచి ఆహార పదార్థాలు దిగుమతి చేసే విషయమే ఆలోచించక, రాష్ట్ర మంతటికీ సరిపడు ఆహార పదార్థాలు ఉన్నాయని ప్రకటించి యింతటి విషమ స్థితిని కొని తెచ్చింది.

అట్లుగాక పెందలాడే ఇల్లు చక్కపెట్టుకొని ఉన్నట్లయితే ఇంత ఘోర స్థితి సంభవించేది కాదేమో?

50 ఏళ్ల క్రితం ఈవారం

6-9-1963
పేజీలు: 12 వెల: 0-20 న.పై

గోపాలరెడ్డి రాజీనామా

నెహ్రూ ప్రభుత్వంలో సమాచారశాఖ మంత్రి పదవి నిర్వహించిన బెజవాడ గోపాలరెడ్డి గారి మంత్రి త్వం పోవడానికి సంజీవ ద్వయం యిరువురూ. తమ తమ స్వప్రయోజనావసరాల దృష్ట్యా, ఎవరి మార్గాన వారు అంతో యింతో ఆజ్యం పోసినట్లు, పోయించినట్లు, యిక్కడి రాజకీయ వర్గాలలో విషయజ్ఞులు వ్యాఖ్యా నిస్తున్నారు. ఈ తెరమరుగు కృషిలో సంజీవరెడ్డి గారికి కామరాజు నాడారు తోడురాగా, సంజీవయ్యకు దేశీయ వ్యవహారాల మంత్రి గుల్జారీలాల్ నందా, కొత్త రఘురామయ్య గారల ద్వారా కృష్ణమీనన్ గారు ఇందిర ప్రోక్తంగా ప్రేరేపించినట్లు ఢిల్లీ నుంచి వచ్చిన ఒకరిద్దరు పార్లమెంటు సభ్యులు ఆంతరంగికులనేవారికి తెల్పినట్లు విశ్వసనీయయంగా తెలియవచ్చింది.

తెర వెనుక, తమ పరోక్షంలో జరిగిన ఈ గ్రంథమంతా గోపాలరెడ్డి గారికి లీలగానైనా గోచరం కాక పోవడం వల్లనే గోపాలరెడ్డి గారు కలకత్తాలో విస్మయం వెలి బుచ్చినట్లున్నది.

ఏమైతేనేమి మంత్రి పదవికి రజతోత్సవము జరిపించుకొన్న గోపాలరెడ్డి గారు ఇక పార్టీ రాజకీయా లలో తల దూర్చక, రాజకీయ రంగానికి అతీతంగా విద్యా సాంస్కృతిక రంగాలలో ప్రవేశించి, తద్వారా దేశాన్ని సేవిస్తూ వుండాలని ఆలోచిస్తున్నట్లుగా ఆయన మనసెరిగిన వారు కొందరు యిక్కడ అంటున్నారు.

ఐతే మాజీమంత్రి వర్గీయులకు చెందిన ఒక బృందం వారు మాత్రం యిలాంటి వైఖరి తగదని, పిసిసి అధ్యక్షులుగా రెడ్డి గారు రాష్ట్ర రాజకీయ రంగంలో నిలబడాలని అభిలషిస్తున్నారు.

నెల్లూరు ముచ్చట్లు

ఉద్యమం ఉధృతం

జిల్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం ఊపందుకొంది. జూలై నెల 30వ తేదీ మొదలైన ఈ ఉద్యమం మాసానికి పైగా కొనసాగుతూ సామాన్యులను సైతం ఆలోచింపజేసింది. ఉద్యోగులు, విద్యార్థులు ప్రాణం పోసిన ఈ ఉద్యమానికి జిల్లా అధికారుల రూపంలో నాయకత్వం కూడా దొరకడంతో ముమ్మందుకు సాగుతుంది. ఎజెసి పెంచలరెడ్డి, డిఆర్వో రామిరెడ్డి నాయకత్వంలో 5వ తేది నెల్లూరులో జరిగిన సింహపురీయుల సింహగర్జన ఉద్యమ ఉధృతిని కళ్లకు కట్టింది.

జిల్లాలో అక్టోబర్ 1 నుంచి నగదు బదలీ!

జిల్లాలో అక్టోబర్ 1వ తేది నుంచి గ్యాస్ వినియోగదారులకు నగదు బదలీ కార్యక్రమం మొదలుకానున్నదృష్ట్యా గ్యాస్ ఏజెన్సీలకు ప్రజలు తమ ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలు సమర్పించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వర రావు స్పష్టం చేశారు. ఈ వివరాలు సమర్పించని గ్యాస్ వినియోగదారులు 990 రూపాయలు చెల్లించి గ్యాస్ సిలిండర్ పొందాల్సి వుంటుందన్నారు.

జిల్లాలో ఐదు లక్షల మందికి పైగా ప్రజలకు ఇంకా ఆధార్ కార్డులు రాలేదు. ఇంకా ఆధార్ కార్డు తీసుకోవాల్సిన వారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉన్నందున మరో 15 రోజులపాటు ఆధార్ కార్డులు తీసే కేంద్రాలు కూడా నడుస్తాయని జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి ఉమామహేశ్వరరావు చెప్పారు.

ప్రముఖుల ఇళ్ల ముట్టడి

సమైక్యాంధ్ర ఉద్యమానికి మద్దతు తెలుపని వారు అనుభవిస్తున్న పదవులకు రాజీనామాలు చేయాలని కోరుతూ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి, బిజెపి ఎమ్పీ ముప్పవరపు వెంకయ్యనాయుడు, ఆర్థిక మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇళ్లను విద్యుత్ ఉద్యోగులు ముట్టడించారు.

వీళ్లు రాజీనామా చేయకుంటే సెప్టెంబర్ 2వతేది నుంచి ఈ ప్రజాప్రతినిధుల ఇళ్లకు విద్యుత్ సరఫరా ఆపేస్తామని చెప్పిన విద్యుత్ ఉద్యోగులు ఈ వ్యవహారమై న్యాయపరమైన చిక్కులతో వెనకడుగు వేశారు.

పగలు ఎండ - రాత్రి వర్షం!

నెల్లూరులో ఎండాకాలాన్ని గుర్తు చేస్తూ గత వారం రోజులుగా 37 డిగ్రీల సెంటీగ్రేడు ఎండ నమోదవుతుంది. ఎండకు అల్లాడుతున్న జనాన్ని సేదతీర్చినట్లు ఆగష్టు 31వ తేది, సెప్టెంబర్ 2, 3తేదీల్లో సాయంత్రం పూట వర్షం పడింది. ఈ విచిత్ర వాతావరణం జనాన్ని అయోమయపరుస్తుంది.

పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌కు ప్రమోషన్!

నెల్లూరు పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారావుకు ప్రభుత్వం ప్రమోషన్ ఇచ్చింది. ఆయన కడప జిల్లా వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల సమన్వయకర్తగా నియమితులయ్యారు. పెద్దాసుపత్రికి కొత్త సూపరింటెండెంట్‌ను నియమించాల్సి వుంది.

సోమశిలలో నీళ్లు!

సోమశిల ప్రాజెక్ట్‌కు పై నుంచి నీళ్లువచ్చి చేరడంతో 21 టిఎంసిల సామర్థ్యానికి చేరుకొంది. జూలై నెలలో 7.4 టిఎంసిల నీళ్లు మాత్రమే ఉండినాయి. వచ్చిన నీళ్లు కండలేరు ద్వారా చెన్నైకు తరలించాలని అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. కృష్ణా నది మిగులు జలాలు మాత్రమే చెన్నైకు తరలించాల్సి వున్నా కర్నూలు, కడప ల్లో పడిన వర్షానికి వచ్చిన నీళ్ల సైతం చెన్నై, తిరుపతి, చిత్తూరులకు పంపేస్తే నెల్లూరు రైతులు ఏం చేయాలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలోచించనవసరం లేదా?

రూ.48కోట్ల రోడ్ల పనులు!

నెల్లూరు నగరంలో ఏకమొత్తంగా 48 కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్ల విస్తరణ పనులు చేస్తున్నారు. మినీబైపాస్, పాత మునిసిపల్ ఆఫీసు, నగరాన్ని ఆనుకొని ఉన్న జొన్నవాడ రోడ్లను విస్తరిస్తున్నారు. ఈ పనులన్నీ గట్టిగా జరగడం లేదని జనం ఫిర్యాదు. ఈ పనులన్నీ నగర, రూరల్ శాసనసభ్యుల ఇంట్లోని మనుషులే బినామీ పేర్లతో చేయడం విశేషం. ఇంకా ఈ పనులు ఇంకెంత సుందరముదనష్టంగా జరుగుతాయో ప్రత్యేకంగా చెప్పాలా?

చందాదారులకు మనవి

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి లేదా Online‌లో ఆంధ్రాబ్యాంక్, విఆర్‌కాలేజ్ బ్రాంచి, నెల్లూరు అకౌంట్ నెంబర్: 106811011000423లో ZAMINRYOT పేరుతో జమచేయవచ్చు. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
- చెక్కులు స్వీకరించబడవు.

జీవిత చందా రూ.1000/-

సంవత్సర చందా

స్వదేశంలో రూ.200/-

విదేశాలకు రూ.1000/-

జమీన్‌రైతు

పాగతోట, నెల్లూరు - 524 001

ఫోన్: 0861 - 2327354

సెల్: 98489 66190

ఎస్పీగారికి కోపమొచ్చింది!

మొన్నీమధ్య ఎస్పీ రామకృష్ణగారు తడ సరిహద్దు వరకు వెళ్లొచ్చారు. జాతీయ రహదారిపై డాబాల్లో మందు బాబుల వీరంగాన్ని స్వయంగా చూసిన ఆయన తిరిగొచ్చాక సెట్ కాన్ఫరెన్స్‌లో ఎస్ఐలను ఈ విషయమై ప్రశ్నించారు. డాబాల్లో మద్యం అమ్మకాలను తక్షణం ఆపమన్నారు. లేకుంటే రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయన్నారు. దొంగతనాలను నియంత్రించకుంటే ఎలా గంటూ పాత నేరస్తుల కదలికలను సిసిఎస్ ఇన్స్‌పెక్టర్లు స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు తెలియజేయాలని ఆదేశించారు. నగరంలో ప్రతిరోజు వాహన తనిఖీలు చేయడంతోపాటు హై స్పీడ్ బైక్‌లపై



సమైక్యాంధ్రకు మద్దతుగా నెల్లూరు శిఖరంవారి వీధిలోని జుమ్మా మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొని అనంతరం మాట్లాడుతున్న ఆనం జయకుమార్‌రెడ్డి.

దృష్టి పెట్టమన్నారు. ఎస్పీ పనిచేయాలని ఆరాట పడుతున్నా సిబ్బందిలో ఉత్సాహం కానరాకపోవడం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందే.

పోలీసాఫీసు ముందు మళ్లీ ప్రమాదం

అదేమిటోగానీ పోలీసాఫీసు రోడ్డులో కొత్తగా వేసిన సిమెంటు రోడ్డు మూలంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గత వారం ఓ మందుబాబు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ గోడను తన కారుతో గుద్ది పడగొట్టిన విషయం మరువక ముందే 3వ తేది ఉదయం ఓ కారు పోలీసాఫీసు ముందు డివైడర్ల కోసం ప్రత్యేకించిన సందులో పడిపోయింది. పోలీసాఫీసు గేటు ముందే ఈ సంఘటన జరగడంతో ఎస్పీ గారు ఆఫీసు రాకముందే దాన్ని తొలగించను ట్రాఫిక్ పోలీసులు నానాపాట్లు పడుతూ కనిపించారు.

పనబాకను నిలదీసిన నెల్లూరు యువకుడు!

సీమాంధ్ర ఉద్యోగుల సంఘం నేత అశోక్‌బాబుతో కలసి ఢిల్లీ వెళ్లిన నెల్లూరు విద్యార్థి నేత కృష్ణయాదవ్ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మిని నిలదీసిన విషయం చర్చనీయాంశమయ్యింది. అందరికీ కథలు చెప్పిన రీతిలో పనబాక లక్ష్మి పరిస్థితిని మేము ఊహించలేదు. అధిష్టానం మనసు మార్చేందుకు ఎంతో కష్టపడుతున్నామని చెబుతుండగా మీరు పడిన కష్టమేమిటి? చేసిన ప్రయత్నమేమిటో చెప్పండని కృష్ణయాదవ్ ఆమెను అడగడంతో బిత్తరపోయారామె. అధిష్టానం మనసు మార్చుకోదని చెప్పిన తర్వాత కూడా ఇంకా పదవులను పట్టుకొని వ్రేలాడడమెందుకని విద్యార్థి నేత మళ్లీ ప్రశ్నించడంతో ఇలాగైతే నేనిక చెప్పేదేమీ లేదని ఉద్యోగ సంఘాల నేతల నుంచి పనబాక తప్పించుకుని వెళ్లిపోయారట.

విద్యుత్ కోత మొదలు

ఎండలు, జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో జిల్లాలో మళ్లీ విద్యుత్ కోతలు మొదలయ్యాయి. నెల్లూరు నగరంలో రెండు గంటలు, మండల కేంద్రాల్లో మూడు గంటలు, గ్రామాల్లో ఆరు గంటల విద్యుత్ కోత సెప్టెంబర్ 1వ తేది నుంచి మొదలయ్యింది. కానీ నెల్లూరులో మాత్రం 2, 3 తేదీల్లో ఎందువల్లో విద్యుత్‌కోత విధించలేదు.

సోమిరెడ్డికి సమైక్య సెగ

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డికి ఈ వారంలో రెండు సార్లు సమైక్యాంధ్ర ఉద్యమం సెగ తగిలి ఊపిరాడని పరిస్థితి వచ్చింది. చెన్నైలోని వళ్లువర్ కొట్టంలో జరిగిన సమైక్యాంధ్ర సంఘీభావ సమావేశానికి వెళ్లిన చంద్రమోహన్‌రెడ్డిని అక్కడి తెలుగు వాళ్లు ఉద్యమంలో తెలుగుదేశం పార్టీ వైఖరిపై నిలదీయడంతో ఎలాగోలా సర్దిచెప్పి తప్పించుకొన్నాడాయన.

2వ తేది నెల్లూరు జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలుపను వెళ్లిన సందర్భంగా కొందరు న్యాయవాదులు తెలుగుదేశం పార్టీ వైఖరిపై ఆయన్ను నిలదీశారు. ఈ పరిణామానికి ఖంగుతిన్న ఆయన ఈ వ్యవహారంతో

కొరవ 14వ పేజీలో

కమర్షియల్ ల్యాండ్ అమ్మబడును

నెల్లూరు జిల్లా,
నార్తురాజుపాళెం,NH-5,
6 లైను ఆనుకొని బాంబే రోడ్
కనెక్టింగ్ హైవే
నాలుగురోడ్ల జంక్షన్, రెడ్డి భవన్
ఆనుకొని అనేక విద్యాసంస్థల
మధ్య సుమారు 3 ఎకరాల
కమర్షియల్ భూమి అమ్మబడును.
అన్ని రకములైన విద్యాసంస్థలు,
మల్టిప్లెక్స్ కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్,
కట్టదలచుకున్న వారికి
అనుకూల స్థలము.

98481 70146
96764 10567

వజ్రం - బంగారం - వెండి
ఫ్యాక్టరీ అవుట్‌లెట్

BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై*
తరుగు 6% నుండి - కూలి లేదు.
వెండి వస్తువులపై*
తరుగులేదు - కూలిలేదు.
డైమండ్స్‌పై 10% తగ్గింపు*
*T&C Apply

గోల్డ్ ప్యాలెస్
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

సిల్వర్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్

925 STERLING SILVER*
EXPORT QUALITY
వెండి వస్తువులపై*
తరుగు లేదు, కూలి లేదు.
*T&C Apply

సిల్వర్ ప్లాజా
EXCLUSIVE SILVER SHOW ROOM
(A Unit of Gold Palace)
ఆచారివీధి, హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీస్ సెంటర్, నెల్లూరు.
ఫోన్: 2331132, 2331121

● మాగుంట లేఅవుట్ కేంద్రంగా

దొంగల కార్యకలాపాలు!

తెలిసినా పట్టించుకోని పోలీసులు!

నగరంలో ఖరీదైన ప్రాంతంగా పేరుబడిన మాగుంట లేఅవుట్ ఇప్పుడు పేరుమోసిన దొంగలు, దోపిడీదారులకు స్థావరంగా మారింది. జిల్లాలోని కప్ప రాళ్లతిప్ప దొంగలకు పలు రాష్ట్రాల్లో భారీ దొంగతనాలకు పాల్పడే దొంగలుగా పేరుంది. సెటిల్‌మెంట్ ఏరియాకు చెందిన ముఠాలు దొంగతనాలకు పాల్పడడం, జాతీయ రహదారిపై దోపిడీ చేయడంలో ఆరితేరిన వారు. ఇలాంటి ఈ ముఠా నాయకులు కొందరు మాగుంట లేఅవుట్, అరవింద నగర్ తదితర ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటుచేసుకొని తమ కార్యకలాపాలు సాగిస్తున్నట్లు సమాచారం. ఇక్కడైతే ఎవరికీ ఎలాంటి అనుమానం రాదని భావించిన దొంగల ముఠాలు ఇక్కడ నివసిస్తున్నాయట. కావలి చుట్టుప్రక్కల గతంలో పేరు గాంచిన ఒక దొంగల ముఠా నాయకుడు అనుచరులతో ఇక్కడే వుంటూ దొంగతనాలు, దోపిడీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. పగలు, రాత్రి అనే తేడా లేకుండా భారీ దొంగతనాలు, దోపిడీలు చేయడంలో వీరు నిష్ణాతులు. మహారాష్ట్ర, కర్నాటక, కలకత్తా, తమిళనాడు రాష్ట్రంలోని మద్రాస్ లాంటి మహానగరాలతోపాటు ఇతర ప్రాంతాల్లో భారీ దొంగతనాలకు పాల్పడుతూ పోలీసుల నుంచి తప్పించుకొని తిరుగుతుంటారు ఈ ముఠా సభ్యులు. అలాంటిది గత కొంతకాలంగా నగరంలో వుంటూ చోరీలకు పాల్పడుతున్నారట. ఇటీవల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక దొంగ మరణించడం, మరొక దొంగ తీవ్ర గాయాల పాలవడం తెలిసిందే. వీరివద్ద దొంగతనానికి అవసరమైన సామాగ్రి దొరకడంతో పోలీసులు వీరిరువురిని పాత రికార్డులతో పోల్చుకుని దొంగలని గుర్తించారు. వీళ్లు దొంగతనానికి యత్నిస్తూ ప్రమాదానికి గురయ్యారని పోలీసులు అనుమానిస్తున్నారు. నగరం నడిబొడ్డులో స్థావరం ఏర్పరచుకొన్న పాత నేరస్తుల కదలికపై పోలీసులు తగిన నిఘా పెడితే దొంగలు దొరుకుతారు.



నెల్లూరుకు గుండెకాయ వంటి మాగుంట లేఅవుట్.

నగరంలో ట్రాఫిక్ తీన్తారు!

ఉద్యమం సాకుతో ట్రాఫిక్ పోలీసుల ఉదాసీనం

నగరంలో ట్రాఫిక్ తీరు అస్తవ్యస్తంగా తయారైంది. సమైక్యాంధ్ర ఉద్యమం పేరుతో ఉద్యమకారులు చేస్తున్న ఆందోళనతో అసలే అస్తవ్యస్తంగా వున్న ట్రాఫిక్ మరింత గందరగోళంగా మారింది. ఇరుకు రోడ్లు, రోడ్లపైకి వచ్చిన ర్యాంప్‌లు, ఎడాపెడా వాహనాలు నిలుపుతుండడం, కొన్ని చోట్ల రోడ్లు పేరుకు విస్తరించినా సగానికిపైగా నిర్మించిన ఐల్యాండ్‌లతో వాహనాల రాకపోకలకు కష్టంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో సమైక్యాంధ్ర కోసం వివిధ సంఘాలు చేస్తున్న నిరసనలు, ధర్నాలు, ఇతరత్రా ఆందోళనలతో నగరంలో ట్రాఫిక్ నడత గజిబిజిగా మారింది. ఆత్మకూరు బస్టాండ్ నుంచి అయ్యప్పగుడి వైపు వెళ్లే మార్గం, అటు నుంచి ఆత్మకూరు బస్టాండ్‌కు వచ్చే రోడ్లతోపాటు, ప్యార్‌లల్ రోడ్లు, చిన్న గొందుల్లో సైతం ఈ ఉద్యమం కారణంగా ట్రాఫిక్ చిక్కుముడిని ఎదుర్కొంటున్నాయి. బృందావనం, విజయమహల్‌గేటు, పొగతోట, కళ్యాణి ఫిలిమ్స్, రామలింగాపురం అండర్ బ్రిడ్జి, మద్రాస్ బస్టాండ్, సిఎఎం స్కూలు, మూలాపేట, కలక్టరేట్, ఇలా అన్ని చోట్లా ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మినీ బైపాస్‌లోనూ వాహనాల రద్దీ పెరిగిపోయింది. పెద్ద పెద్ద వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఈ ఉద్యమ ఆందోళనను తప్పించుకొనేందుకు కన్పించిన రోడ్లలోకి వచ్చేస్తుండడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలబడిపోయి వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఎదురౌతుంది. ఈ విషయంలో పోలీసు వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోంది. ట్రాఫిక్ అధికంగా వున్న ప్రాంతాల్లో పోలీసు జాడ కన్పించడం లేదు.



నెల్లూరులో ప్రతిరోజూ ఇటువంటి దృశ్యం మామూలే.

సమైక్యాంధ్ర ఉద్యమంలో సందడే సందడి!



రోడ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయినులు, పిల్లలు.

● అన్నీ రోడ్లపైనే...

సమైక్యాంధ్ర ఉద్యమం కారణంగా నగరంలో సందడి నెలకొనింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర విభజన నిర్ణయాన్ని తీసుకోవడాన్ని నిరసిస్తూ వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, ఎన్‌జిఓలు, ఉపాధ్యాయులు, అధికారులు ఎవరికివారు తమ నిరసనను, కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పొట్టి శ్రీరాములు, శ్రీకృష్ణ దేవరాయలు వేషధారణతోపాటు తెలంగాణ రాష్ట్ర సమితి నేత కె.చంద్రశేఖర్‌రావు, సోనియాగాంధీల దిష్టిబొమ్మలకు దహన సంస్కారాలు, పిండప్రదానం, దిష్టిబొమ్మల దగ్ధం చేయడం లాంటి కార్యక్రమాలతో కొందరు నిరసన తెలుపుతుండగా మరికొందరు రహదారులను తమ ఇష్టానుసారంగా వినియోగించుకొంటూ అడిగేవారు లేరనే ధైర్యంతో వ్యవహరిస్తుండడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. తొక్కుడు బిళ్ల, బిళ్ల కోడి, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ లాంటి ఆటలకు రోడ్లనే క్రీడామైదానాలుగా మార్చేస్తూ జనంతో ఆటలాడుకొంటున్నారు. మరికొందరు వంటావార్పు పేరుతో రోడ్లపై ఎక్కడికక్కడ పొయ్యిపెట్టి, పెద్ద పెద్ద వంట పాత్రలు పెట్టి వండి అక్కడే సామూహికంగా భోజనాలు చేస్తూ నానా రభస చేస్తుండడంతో సాధారణ ప్రజలకు చిక్కులొచ్చి పడ్డాయి. అడుగడుగునకు నిరసన, రాస్తారోకో, ర్యాలీలతో ఎవరికి వారు సొంతంగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో నగరంలో సమైక్యాంధ్ర ఉద్యమం కారణంగా సందడి నెలకొనింది.

వరుసబెట్టి విడుదలవుతున్న చిన్న సినిమాలు!

సమైక్యాంధ్ర ఉద్యమం చేసిన మేలు

రాష్ట్ర విభజనకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేయడం, తదనంతరం రాష్ట్రంలో సమైక్యాంధ్ర ఉద్యమం రోజురోజుకు ఉధృతం కావడం తెలిసిందే. బస్సులు నిలిచిపోయి, విద్యాసంస్థలు దీర్ఘకాలికంగా నడవక, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఈ ఉద్యమ ప్రభావంతో చిన్న సినిమాలు ఆడేస్తున్నాయి. సాధారణంగా లోబడ్జెట్ సినిమాలు, చిన్న చిన్న యాక్టర్లు, తక్కువ ఖర్చుతో తీసే సినిమాలకు సినిమా హాళ్లు దొరకని పరిస్థితి. సినీ రంగంలో నలుగురైదుగురు బడా నిర్మాతలే సినిమా హాళ్లను తమ చేతుల్లో పెట్టుకొని పెద్ద నటులు నటించిన సినిమాలను ఆయా హాళ్లలో విడుదల చేయిస్తూ చిన్న సినిమాలకు, తమ వర్గం కాదనుకున్న సినీ నటుల సినిమాలకు హాళ్లు దొరకకుండా చేస్తుంటారు. ఇది జగమెరిగిన సత్యం. ఒక వేళ విడుదలైనా వారంలోపలే బాగా ఆడుతున్నా, ప్రేక్షకుల ఆదరణ పొందినా ఎత్తేస్తుంటారు. అలాంటి వాతావరణం నెలకొని వుంది సినిమా విడుదలలో. అలాంటిది సమైక్యాంధ్ర ఉద్యమం రాష్ట్రంలో ఉవ్వెత్తున ఎగసి పడుతుండడంతో భారీ బడ్జెట్‌తో, అగ్ర హీరోలతో నిర్మించిన సినిమాలు విడుదలకు నోచుకోవడం లేదు. రామ్‌చరణ్ తేజ నటించిన ఎవడు, పవన్‌కళ్యాణ్ నటించిన అత్తారింటికి దారేది లాంటి సినిమాలు ఆగష్టు మొదటి వారంలోనే విడుదల కావాల్సి వున్నా వాయిదాల మీద వాయిదాలు పడుతూ వస్తున్నాయి. దీంతో చిన్న సినిమాలు ఎలాంటి ఇబ్బంది లేకుండా వరుసబెట్టి విడుదలై పోతున్నాయి. వీటిలో చాలామటుకు ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. సమైక్యాంధ్ర ఉద్యమం చిన్న సినిమా నిర్మాతలకు మాత్రం మంచే చేసిందని ప్రేక్షకులు వ్యాఖ్యానిస్తున్నారు.



నెల్లూరులో చిన్న సినిమాల సందడి.

● ప్రభుత్వ పాఠశాలల్లో

చదివే విద్యార్థులకు కష్టాలు!

ఉద్యమం మూలంగా తెరుచుకోని పాఠశాలలు

సమైక్యాంధ్ర ఉద్యమం విద్యార్థులపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. వారాల తరబడి పాఠశాలలు తెరుచుకోక పోతుండడం, మరోవైపు ఉపాధ్యాయులు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటుండడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉద్యమం కారణంగా చదువులు సాగక నష్టపోతున్నారు. అసలే అంతంతమాత్రంగా సాగే చదువులు చట్టుబండలవుతున్నాయి. పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు చాలినన్ని అందక, యూనిఫారాలు పూర్తిస్థాయిల్లో విద్యార్థులకు అందుబాటులోకి రాక, ఉపాధ్యాయుల కొరతతో అరకొర వసతి సౌకర్యాల నడుమ, శిథిలమైన శ్లాబ్ పెచ్చులూడుతుంటే చెట్ల క్రింద చదువుకుంటూ అవస్థలు పడుతున్న విద్యార్థులకు ఈ సమైక్యాంధ్ర ఉద్యమం పేరుతో కొన్ని ఉపాధ్యాయ సంఘాలు, ఆర్టీసి కార్మికులు, ఎన్‌జిఓలు, విద్యార్థి ఐక్యకార్యాచరణ సమితి చేస్తున్న ఉద్యమాలతో చదువులకు మరిన్ని ఆటంకాలు తెచ్చి పెట్టాయి. సక్రమంగా బడులు నడవక, ఉపాధ్యాయులు విధిగా పాఠశాలలకు హాజరుకాక పోతుండడంతో విద్యార్థుల చదువు ముందుకు సాగక కుంటుపడుతోంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు విద్యార్థులు హైస్కూల్‌కు, కళాశాలలకు, ఆర్టీసి బస్సుల్లో వెళ్లి చదువుకొంటుంటారు. ఆర్టీసి కార్మికులు సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొంటుండడంతో జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు వెళ్లేవారు ఈ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరిగా విద్యనభ్యసించలేక పోతున్నారు. సమైక్యాంధ్ర కావాలనేది అందరి భావన. అలాగని విద్యార్థుల చదువులకు ఆటంక పరిచే అధికారం ఉద్యమకారులకు ఎక్కడిది? పిల్లల భవిష్యత్తు కోసం ఉద్యమం అని ఒకవైపు చెబుతూ అలాంటి భావి భారత పౌరుల చదువుకు నష్టం కల్గించడం ఎంతవరకు సమంజసమో ఉద్యమకారులే సమాధానం చెప్పాలి.

చేజర్ల టీచర్ల వినూత్న నిరసన!



నల్ల చీరల్లో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయినులు.

సమైక్యాంధ్రకు మద్దతుగా చేజర్లలో ఉపాధ్యాయులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సమైక్యాంధ్ర ఉద్యమ జెఎసి ఆధ్వర్యాన జరుగుతున్న ఈ దీక్షల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు న్యాయదేవతను ఏర్పాటుచేసి ఆమె ముందు మహిళా టీచర్లు నల్లచీరలు ధరించి దీక్షలో పాల్గొన్నారు. ఐక్యంగా వున్న తెలుగుజాతిని ముక్కలు చేస్తున్న దుష్టశక్తుల నుంచి కాపాడమని, కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకొనేలా చూడమంటూ న్యాయదేవతను వేడుకొన్నారు. ఈ దీక్షలకు సంఘీభావం తెలిపిన ఎంపిడిఓ వాణి మాట్లాడుతూ సీమాంధ్ర ప్రజాప్రతినిధులందరూ తమ పదవులకు రాజీనామా చేయాలని, రాజ్యాంగ సంక్షోభం సృష్టించి కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కల్గించాలన్నారు. టికెపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసులు, మండల విద్యాధికారి సత్యనారాయణమూర్తి ప్రారంభించిన ఈ దీక్షలకు స్థానిక నేతలు, దర్జీలు, వ్యాపారులు, ముస్లింలు, విద్యార్థులు, ఉపాధ్యాయ జెఎసి నాయకులు మద్దతు పలికారు.

● గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజిలో

అత్యాధునిక బోధనా వసతులు!

● మూల్యాంకన కేంద్రంగా కూడా గుర్తింపు



మారుతున్న విద్యావిధానానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక విద్యను అందిస్తున్న విద్యా సంస్థ గీతాంజలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి. కోవూరు మండలం గంగవరంలో ఏర్పాటైన ఈ ఇంజనీరింగ్ కళాశాల అన్నీ విభాగాల్లో శిక్షణనివ్వడమేకాక విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరింతగా విజ్ఞానాన్ని పెంపొందించుకొనేందుకు లైబ్రరీని, ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పిస్తోంది. విద్యార్థులు కోర్సు పూర్తి చేసుకొన్నాక ఉన్నతంగా రాణించేలా మెరుగైన విద్యాబోధన అందించడమే కాకుండా శారీరక, మానసిక వికాసం కోసం క్రీడలు, యోగా తదితర వాటిల్లో ప్రత్యేక శిక్షణనిస్తూ ప్రోత్సహిస్తున్నారు. హాస్టల్ విద్యార్థులతోపాటు కళాశాల విద్యార్థులందరికీ ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం అందించడమేకాక కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రత్యేక శిక్షణ, అలాగే సి, సి++ లాంటి కోర్సులోనూ శిక్షణనిస్తూ విద్యార్థులకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు చేపడుతోంది. ఇంటర్‌లో ప్రతిభ కన్పరచి ఇంజనీరింగ్ చేరే విద్యార్థులకు ఫీజు రాయితీ ఇవ్వడంతోపాటు ల్యాప్‌టాప్‌లు బహుమతిగా అందించడమేగాక ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తూ ప్రతిభను ప్రోత్సహిస్తోంది. అనంతపూర్ జెఎన్‌టియూ వారిచే ప్రతిష్టాత్మకమైన మూల్యాంకన కేంద్రం గుర్తింపు పొందిన ఏకైక ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి. పేరొందిన కంపెనీల్లో నియామకాలకు ప్లేస్‌మెంట్ సౌకర్యం కల్పిస్తుంది.

రాష్ట్రాన్ని ముక్కలు చేయచూస్తున్నది కాంగ్రెసే!

కలువాయిలో కాకాని



శిబిరంలో మాట్లాడుతున్న కాకాని గోవర్ధన్‌రెడ్డి.

ఓట్లు, సీట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ముక్కలు చేస్తోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాని గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. సీమాంధ్రలో సమైక్యవాదం రోజురోజుకూ ఉధృతం అవుతున్నా, అన్ని వర్గాల ప్రజలు బంద్‌లు, రాస్తారోకోలు, నిరసన దీక్షలు చేస్తున్నా ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ పెద్దలకు చీమకుట్టినట్లయినా లేకపోవడం సిగ్గు చేటన్నారు. స్వార్థరాజకీయాల కోసమే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేస్తున్నాదని దుయ్యబట్టారు. కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు జవజీవాలు కల్పించిన నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డని, అలాంటి నాయకుడి కుటుంబాన్ని ఈనాడు కాంగ్రెస్ పార్టీ పలురకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కలువాయిలో సమైక్యాంధ్ర కోసం, వైఎస్ జగన్ చేపట్టిన దీక్షకు మద్దతుగా మాజీ ఎంపిపి అనిల్‌కుమార్‌రెడ్డి చేపట్టిన దీక్షకు ఆయన సంఘీభావం ప్రకటించారు. ఈ దీక్ష నాల్గవ రోజుకు చేరుకోవడం, అనిల్ ఆరోగ్యం క్షీణిస్తుండడంతో పోలీసులు దీక్ష భగ్నం చేసి ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. దీనికి నిరసనగా కలువాయి మండలంలో బంద్ నిర్వహించారు.

మినగల్లులో ఎర్రచందనం పట్టివేత!

బుచ్చిరెడ్డిపాళెం మినగల్లు గ్రామంలో కోటి రూపాయలు విలువ చేసే ఎర్రచందనం దుంగలను అటవీశాఖ సిబ్బంది పట్టుకొన్నారు. రెండు విడతలుగా జరిగిన ఈ దాడుల్లో మొత్తం 245 దుంగలను కనుగొన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఎర్రచందనం దుంగలు గ్రామంలో దొరకడం సంచలనం రేపింది. స్థానికంగా వుండే సిజెఎఫ్ఎస్ భూముల్లో ఎర్రచందనం దుంగలను దాచి వుంచారన్న సమాచారం అందుకొన్న గుంటూరు డివిజన్ ఫారెస్ట్ ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీలు జరపడంతో పొలాల్లో దాచి వుంచిన 243 దుంగలు బయటపడ్డాయి. అలాగే మినగల్లు నుంచి పెనుబల్లికి వెళ్లే మార్గంలో

కోటి రూపాయలు విలువ చేస్తుందని స్క్వాడ్ వెల్లడి

పోతురాజుదిబ్బ వద్ద మరో రెండు దుంగలను అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. దాడుల అనంతరం అటవీశాఖాధికారి హుస్సేన్ మాట్లాడుతూ తమకు పక్కా సమాచారం రావడంతో ఈ దాడులు జరిపామని, దాదాపు ఐదున్నర టన్నుల బరువుండే దుంగలు దొరికాయని, వీటి విలువ కోటి రూపాయలపైనే వుంటుందన్నారు. వీటిని ఇక్కడ ఎవరు దాచారు, ఎవరి ప్రమేయం వుందన్న దానిపై విచారణ జరుపుతున్నామన్నారు. బుచ్చికి చెందిన 20 మందికి ఎర్రచందనం అక్రమ వ్యాపారంలో సంబంధాలున్నట్లు గుర్తించామని చెప్పారు. బుచ్చి మండలంలో పెద్దఎత్తున ఎర్రచందనం దొరకడం తీవ్ర చర్చనీయాంశమయ్యింది.

✦ గ్రామాల దాహార్తి తీర్చనున్న

డాక్టర్ ప్రేమ్‌సాగర్‌రెడ్డి!

వాటర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు శ్రీకారం

ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలన్న ఉద్దేశంతో జిల్లాలో పలు గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు నార్త్‌అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) నిర్వాహక కమిటీ సభ్యుడు బద్దెవోలు శ్రీహరిరెడ్డి తెలిపారు. జన్మభూమికి సేవ చేయాలనే లక్ష్యంతో ప్రవాస భారతీయుడు డాక్టర్ ఎన్.ప్రేమసాగర్‌రెడ్డి ఆర్థిక సహకారంతో జిల్లాలో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయన ఇందుకూరుపేట మండలం మైపాడులో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు విచ్చేశారు. స్థానిక నేత దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, చెన్నారెడ్డి రవీంద్రరెడ్డితో కలసి స్థల పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ మైపాడుతోపాటు వీరంపల్లి, బద్దెవోలు, నిడిగుర్తి, ఈపూరు, గుడ్లూరువారిపాళెం, కలివెలపాళెం, కసుమూరు, మిట్టపాళెం తదితర గ్రామాల్లో ఈ వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఇస్కపాళెం, నిడిగుంటపాళెం గ్రామాల్లో ఈ ప్లాంట్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఒక్కో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు 8 నుంచి 10 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే కాకుండా నిడిగుంటపాళెం, బద్దెవోలు, చేనిగుంట గ్రామాల్లోని స్మశానాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ విద్యాసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ వైభోగమే...



నెల్లూరు నేతాజి పైలెట్ హైస్కూల్ కరస్పాండెంట్ నేతాజి సుబ్బారెడ్డి కుమార్తె డాక్టర్ అలేఖ్య, బిజెపి రాష్ట్ర కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి కుమారుడు డాక్టర్ సుబ్రామ్‌ల వివాహం ఆగష్టు 30వ తేది ముత్తుకూరు రోడ్డులోని కెజికె కళ్యాణ మండపంలో జరిగింది.



సర్వేపల్లి మాజీ ఎమ్మెల్యే సివిశేషారెడ్డి బావమర్ది మారు వెంకటరమణారెడ్డి కుమారుడు హర్షవర్ధన్‌రెడ్డి, పద్మావతిల వివాహం ఆగష్టు 24వతేది నెల్లూరు కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరిగింది.



నెల్లూరు బాలాజీనగర్ వాసి రిటైర్డ్ సంస్కృతం టీచర్ పల్లెకొండ నాగరాజశర్మ కుమార్తె శేషస్వప్న-శరచ్చంద్రబాబుల వివాహం 17వ తేది త్యాగరాజ కళ్యాణ మండపంలో జరిగింది.



సమైక్యాంధ్ర కోసం పోరాటం కొనసాగించాలి!

కావలిలో కాకాని

రాష్ట్ర విభజన నిర్ణయం ఉపసంహరించుకొని రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచేవరకు పోరాటం కొనసాగించాలని జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాని గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కావలి పట్టణానికి విచ్చేసిన ఆయన జెఎసి చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. తెలుగు ప్రజల్లో చిచ్చు పెట్టేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించిన ఆయన సమైక్యాంధ్ర కోసం ఐక్యకార్యాచరణ సమితి చేస్తున్న దీక్షలకు పూర్తి సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఈ దీక్షలు చేపట్టిన జెఎసి కన్వీనర్ తిరివీధి ప్రసాద్‌ను ఆయన అభినందించారు. సమైక్యాంధ్ర కోసం జరిపే ఈ పోరాటానికి ప్రజలందరూ కలసి రావాలని తిరివీధి ప్రసాద్ పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా నాయకులు వచ్చి సంఘీభావం తెలపడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు. చాలాకాలం తర్వాత కావలి వచ్చిన కాకాని గోవర్ధన్‌రెడ్డిని కలిసేందుకు పలువురు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



సమైక్యాంధ్రకు మద్దతుగా బోగోలు తహశీల్దార్ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న రెవిన్యూ ఉద్యోగులకు మద్దతు తెలుపుతున్న నాగులవరం పిఎసిఎస్ అధ్యక్షుడు యర్రం వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్‌జివి కండ్రిగ సర్పంచ్ కోడూరు వెంకటేశ్వర్లురెడ్డి.



సమైక్యాంధ్రకు మద్దతుగా బోగోలులో వైఎస్ఆర్ సెంటర్‌లో నిరసన దీక్ష చేస్తున్నవారికి సంఘీభావంగా దీక్షలో కూర్చున్న నాగులవరం సర్పంచ్ గణేశం రమేష్‌రెడ్డి, మునగాల గోపాలరెడ్డి.

● నిరుపయోగంగా...

ఆత్మకూరు అటవీశాఖ క్వార్టర్లు!

కార్యాలయాలకు సొంత భవనాలు లేక, సిబ్బందికి క్వార్టర్స్ లేక ఒకవైపు అవస్థలు పడుతుంటే మరోవైపు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోక ముళ్లచెట్ల మధ్య మిగిలిపోతున్నాయి. వీటికి ఎప్పుడు మోక్షం లభిస్తుందో ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో అని ఎదురుచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీనికి ఉదాహరణ ఆత్మకూరులో అటవీశాఖ సిబ్బందికి నిర్మించిన భవనాలు. ఆత్మకూరు సమీపంలో గల నెల్లూరుపాళెం వద్ద అటవీశాఖ సిబ్బందికి 40లక్షల రూపాయలతో నివాసం వుండేందుకు క్వార్టర్స్ నిర్మించారు. ఆధునిక వసతి సౌకర్యాలతో సిబ్బంది సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకోక ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిపై అధికారులకు పలుమార్లు తెలిపినా ఎవరూ పట్టించుకోకపోవడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృధాగా మారుతుండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగచేసుకొని ఈ భవనాలను ప్రభుత్వ కార్యాలయాలుగా అయినా మార్చి వినియోగంలోకి తీసుకరావాలని పలువురు కోరుకొంటున్నారు.

రూ40లక్షల ప్రజాధనం నిర్లక్ష్యం పాలు

సమైక్యాంధ్రగా ఎందుకుండాలంటే...

సమైక్యాంధ్ర కావాలని, రాష్ట్ర విభజన వద్దంటూ రెండు వారాలుగా జిల్లాలో ఉద్యమిస్తున్న విషయం తెలిసిందే. ఎందుకు రాష్ట్రం సమైక్యంగా వుండాలి, విభజన వల్ల కలిగే లాభనష్టాలపై ప్రజలకు ఎవరూ వివరించ లేకపోతున్నారు. కేవలం నిరసనలు, ధర్నాలు, రాస్తారోకోలతో నిర్వహిస్తున్నారు. దీనికి భిన్నంగా కావలిలో రాష్ట్రం సమైక్యంగా ఎందుకు వుండాలో కారణాలు ప్రజలకు తెలిసేలా తయారుచేసిన కరపత్రాలను పంచిపెట్టారు కాంగ్రెస్ పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి. పట్టణంలోని ఏరియా వైద్యశాల ప్రక్కన సమైక్యాంధ్ర పరిరక్షణ సమితి నేత కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షుడు మలిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని సందర్శించిన విష్ణు ఈ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ హైదరాబాద్ అభివృద్ధిలో సీమాంధ్రుల కష్టం, వారి పాత్ర ఎంతో వుందన్నారు. మెదక్‌లో సైతం సీమాంధ్రులు పారిశ్రామికంగా పెట్టుబడులు పెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటువరకు అన్నీ అంశాలను ప్రస్తావిస్తూ కరపత్రాలను రూపొందించిన జగదీశ్వర్‌రెడ్డిని ఆయన అభినందించారు.

కావలిలో కరపత్రాలు విడుదల చేసిన విష్ణు

అంగళ్లకు అమ్మహస్తం సరుకులు!

రేషన్ డీలర్ల తెగింపు

పేదల కోసం అమ్మహస్తం పథకం పేరుతో రేషన్ షాపుల ద్వారా 185 రూపాయలకే పలు రకాల సరుకులను ప్రభుత్వం అందిస్తోంది. చింతపండు, గోధుమ పిండి, కందిపప్పు, మిరప్పొడి, గోధుమలు, ఉప్పు, నూనె, పంచదార, పసుపు తదితర తొమ్మిది రకాల వస్తువులను ఈ మొత్తానికి తెల్లకార్డు కల్గినవారికి అందిస్తారు. వీటిలో చింతపండు 30 రూపాయలు, కందిపప్పు 50 రూపాయలు, నూనె 40 రూపాయలు, ఇతర వస్తువుల ధరలు అన్నీ కలిపి 185 రూపాయలుగా నిర్ణయించారు. అయితే రేషన్ డీలర్లు వినియోగదారులకు ఈ తొమ్మిది వస్తువులను కొంటేనే సరుకులను ఇస్తామని చెప్పుండడంతో పేదలు అంత డబ్బు పెట్టి అన్నీ వస్తువులను తీసుకోక కేవలం బియ్యం, కిరోసిన్ మాత్రమే తీసుకపోతున్నారు. దీన్ని అవకాశంగా చేసుకొన్న డీలర్లు మిగిలిన వస్తువులను మార్కెట్‌కు తరలించి అమ్మేసుకొంటున్నారు. తోటపల్లిగూడూరు, మనుబోలు, వెంకటాచలం, ముత్తుకూరు, పొదలకూరు, సంగం, బుచ్చి తదితర మండలాల్లోని కొందరు రేషన్ డీలర్లు ఈ తొమ్మిది రకాల వస్తువులను అమ్ముకొని సొమ్ము చేసుకొంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. పౌర సరఫరాల శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించి పేదలకు ప్రభుత్వం అందించే వంట సరుకులు పక్కదారి పట్టకుండా తగిన చర్యలు చేపట్టాల్సి వుంది.

పొదలకూరు చెరువుల మరమ్మత్తులకు నిధులు మంజూరు!

పొదలకూరులోని చెరువుల మరమ్మత్తులకు ప్రభుత్వ అనుమతి లభించింది. మండల పరిధిలోని ఎనిమిది చెరువులకు మరమ్మత్తులు చేపట్టేందుకు ఇరిగేషన్ శాఖ ద్వారా నిధులు మంజూరయ్యాయి అని దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని ఆ శాఖ ఎఇఇ ఖలీల్ అహ్మద్ తెలిపారు. మండల పరిధిలోని దేగపూడి, నావూరు, నేదురుమల్లి చెరువులకు 39.60 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయని ఇందులో ఒక్కొక్క చెరువుకు 9.90 లక్షల వంతున కేటాయించినట్లు తెలిపారు. అలాగే కలెక్టర్ ద్వారా విడుదలైన 19.60లక్షల నిధులతో చిట్టేపల్లి, ఆల్తుర్తి, గొట్టిగుండాల చెరువు, నరసింహకండ్రిగ చెరువుల మరమ్మత్తులు చేపట్టినట్లు తెలిపారు. ఈ నిధుల్లో ఒక్కో చెరువుకు 4.9లక్షల రూపాయలు వ్యయం అవుతుందని అన్నారు. విరువూరు సప్లై ఛానల్ పూడిక తీతకు 9.05లక్షల రూపాయలు మంజూరయ్యాయని ఈ పనులన్నింటిని త్వరిత గతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

● రాష్ట్ర విభజన


పాపం కాంగ్రెస్ పార్టీదే!

గూడూరులో సమైక్యాంధ్రకు మద్దతుగా వివిధ పార్టీలు ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నాయి. అటు తెలుగుదేశం, ఇటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో గూడూరు పట్టణం తోపాటు మండల పరిధిలో సమైక్యాంధ్ర నినాదం మారుమ్రోగుతోంది. సమైక్యాంధ్రకు మద్దతుగా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిని దిగ్భందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సీనియర్ టిడిపి నేత కోడెల శివప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్ర విభజన పాపం కాంగ్రెస్‌పార్టీదేనని కానీ నిందా తెలుగుదేశంపై మోపుతున్నారన్నారు. తెలంగాణ ఇచ్చేది మేమే, తెచ్చేది మేమే అని కాంగ్రెస్ పార్టీ ప్రకటించి దానికి అనుగుణంగా విభజన నిర్ణయం తీసుకొన్నదని, సీమాంధ్రలో మాత్రం లేఖ ఇచ్చి చంద్రబాబు విభజనకు కారకుడయ్యాడని ఆరోపించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రులు రాజీనామా చేస్తే విభజన ప్రక్రియ ఆగిపోతుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధి వెనుక రాష్ట్రంలోని తెలుగు ప్రజలందరి కృషి ఎంతో వుందన్నారు. అలాంటిది ఈ విభజన నిర్ణయంతో అక్కడున్న తెలుగువారిని సీమాంధ్ర ప్రాంత ప్రజలుగా ముద్రవేసి హైదరాబాద్ వదలి వెళ్లమనడం మంచి పద్ధతి కాదన్నారు. బల్లి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్పీలు, మంత్రి కన్పించడం లేదని జెఎసి గోడ పత్రికలు ముద్రించిందని, ఇకనైనా వారు స్పందించి తమ పదవులకు రాజీనామా చేసి ప్రజలతో కలసి ఉద్యమంలో పాలుపంచుకొని విభజన ప్రక్రియ ఆగేందుకు తమవంతు కృషి చేయాలన్నారు.

గూడూరులో కోడెల విమర్శ

రాష్ట్రాన్ని విభజిస్తే అన్నీ సమస్యలే!

తేల్చిచెప్పిన ఎమ్మెల్సీ వాకాటి



రాష్ట్రాన్ని విడదీస్తే ఎన్నో సమస్యలు తలెత్తుతాయని శాసన మండలి సభ్యుడు వాకాటి నారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. సమైక్యంగా వున్న రాష్ట్రాన్ని విభజించడం సరైన విధానం కాదన్నారు. ఈ విషయాన్ని ఆంటోని కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బి బంగ్లాలో సమైక్యాంధ్ర ఉద్యమం, విభజన నిర్ణయం తదితర అంశాలపై విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని ముక్కలు చేయడం సులభం అని, కానీ దాని తర్వాత తలెత్తే సమస్యలను ఎదుర్కోవడం కష్టమన్నారు. విద్య, వైద్యం, త్రాగునీరు, సాగునీరు, విద్యుత్, ఉపాధి ఇలా ప్రతి అంశం కష్టతరంగా, సమస్యగా మారుతుందన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. ఇదే విషయాన్ని అధిష్టానం వద్ద ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి వివరించారన్నారు. తెలంగాణ విషయంలో కాంగ్రెస్ పార్టీ తప్ప మిగతా అన్నీ పార్టీలు దొంగాట ఆడుతున్నాయని వివరించారు. ఉద్యమం ప్రజల నుంచి వచ్చిందని, అందుకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు నడవక తప్పదన్నారు. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచడం కోసం ఎన్ని పొరాటాలకైనా సిద్ధమన్నారు. అనంతరం పొట్టిశ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో చెంగాళమ్మ ఆలయ ఛైర్మన్ ఇసనాక హర్ష వర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు వాకాటి మునికృష్ణారెడ్డి, సుధాకర్ రెడ్డి, యుగంధర్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమైక్యాంధ్రకు మద్దతుగా కావలిలో దీక్ష చేస్తున్న ఆరు మండలాల ఉపాధ్యాయుల దీక్షా శిబిరంలో ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు. ప్రక్కన ఆత్మకూరు బ్రహ్మయ్య, తటవర్తి వాసు, మలిశెట్టి వెంకటేశ్వర్లు వున్నారు.



సమైక్యాంధ్రకు మద్దతుగా నెల్లూరు గాంధీబొమ్మ వద్ద ధర్నా చేస్తున్న ది కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఆర్కిటెక్ట్స్ అండ్ లైసెన్స్‌డ్ బిల్డింగ్ సర్వేయర్స్ అసోసియేషన్ సభ్యులు.

● వెంకటగిరిలో

బాలికల హాస్టల్ ప్రారంభమెప్పుడు?

మూడేళ్లుగా కుదరని ముహూర్తం

లక్షల రూపాయలు వెచ్చించి వెంకటగిరిలో నిర్మించిన బాలికల హాస్టల్ మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోలేదు. చిన్న చిన్న సాకులతో దీన్ని వినియోగంలోకి తీసుక రాకపోవడంతో పిల్లలు వుండాల్సిన హాస్టల్ ఇప్పుడు పేకాట రాయుళ్లు, తాగుబోతులు, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. స్థానిక కాలేజీమిట్ట వద్ద నిర్మితమైన ఈ బాలికల హాస్టల్ భవనానికి దాదాపు 30 లక్షల రూపాయలు ఖర్చు చేశారు. పాత హాస్టల్‌ను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అరకొర వసతి సౌకర్యాలు వుండడం, బాలికల సంఖ్యకు తగినట్లు గదులు లేకపోవడంతో ఈ నూతన హాస్టల్‌ను నిర్మించేందుకు 2004లో ఆనాడు విద్యాశాఖ మంత్రిగా వున్న నేదురుమల్లి రాజ్యలక్ష్మమ్మ శంకుస్థాపన చేశారు. కొంత ఆలస్యంగానైనా హాస్టల్‌కు నూతన భవనం ఏర్పాటైంది. అయితే ప్రారంభానికి మాత్రం నోచుకోక ఎదురుచూపులు చూస్తోంది. దీనికి కారణం మరుగుదొడ్ల నిర్మాణానికి తగినంత నిధులు లేనందున వాటి విడుదలకు ఎదురు చూస్తుండడంతో హాస్టల్ నిర్మాణానికి గ్రహణం పట్టుకొంది. ఎప్పుడెప్పుడు కొత్త భవనానికి వెళ్దామా అని ఎదురు చూస్తున్న విద్యార్థినులకు అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని కారణంగా నిరాశ ఎదురౌతోంది. బాలికల సౌకర్యాన్ని దృష్టిలో వుంచుకొని త్వరితగతిన బాత్‌రూంలు నిర్మించి హాస్టల్ భవనాన్ని వినియోగంలోకి తీసుక రావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● బోగోలు, ముంగమూరు

చెరువుల పనులకు ఆటంకాలు!

పనులు చేయని కాంట్రాక్టర్లు

బోగోలు, ముంగమూరు చెరువుల అభివృద్ధికి గ్రహణం పట్టింది. అంగట్లో అన్నీ వున్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా చెరువు మరమ్మత్తు పనులకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో చెరువుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కావలి శాసనసభ్యుడు బీద మస్తాన్‌రావు ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో గతంలో కావలిలో జరిగిన బహిరంగ సభలో చెరువు మరమ్మత్తు పనులకు హామీ ఇవ్వడంతోపాటు పని చేసే ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అని పొగడ్తలతో ముంచెత్తాడు. బీద మస్తాన్‌రావు కృషి ఫలితంగా మరమ్మత్తు పనులకు బోగోలు చెరువుకు 96 లక్షల రూపాయలు కేటాయించారు. మంత్రి అనుచరుడైన కాంట్రాక్టర్ ఈ పని చేయడానికి ముందుకు వచ్చినప్పటికీ ఇంతవరకు ఒక చిన్న పని ప్రారంభించలేదు. అధికారులు మాత్రం రైతులకు అదిగో ఇదిగో అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు తప్ప చెరువు పనులు కాంట్రాక్టర్ చేత ప్రారంభింపజేసేందుకు చర్యలు చేపట్టడం లేదు. మంత్రికి భయపడి కాంట్రాక్టర్‌ను ఏమీ అడగలేక పోతున్నారట. అలాగే ముంగమూరు చెరువుకు అధికారపార్టీ నేతలు కొందరు అడ్డుపడడంతో గత కొంతకాలంగా ఈ రెండు చెరువుల మరమ్మత్తు పనులు జరిపేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్న ఎమ్మెల్యే మస్తాన్‌రావు శ్రమకు ఫలితం దక్కడం లేదు. మంత్రి అనుచరులు, కాంగ్రెస్ నేతలు అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డు తగులుతుండడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురికి కూపంలా కావలి ఇస్లాంపేట!

ఇబ్బందిపడుతున్న జనం

పేరుకు మునిసిపాలిటీ అయినా పారిశుధ్య పరిస్థితులు మాత్రం ఘోరంగా వున్నాయి. కావలి పట్టణంలోగల ఇస్లాంపేటలో మురుగునీరు ఇళ్ల మధ్య చేరి, దోమలు విజృంభిస్తూ, దుర్గంధం వెదజల్లుతూ అధ్వాన్నంగా వుంది ఈ ప్రాంతం. రెండవ వార్డు పరిధిలోకి వచ్చే ఇస్లాంపేటలో పట్టణానికి పడమర ప్రాంతం నుంచి వచ్చే మురుగునీరు ఈ ప్రాంతం నుంచే వెళ్లాలి. సైడు కాలువలు సక్రమంగా లేక, మురుగునీరు ప్రవహించే మార్గం లేకపోవడంతో ఆ నీరంతా ఈ ప్రాంతంలోని ఇళ్ల చుట్టూ చేరుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రక్కనేగల గాయత్రీ నగర్ పరిస్థితి ఇంతే. తమ ప్రాంత పరిస్థితిని, మురుగునీళ్ల ఇళ్ల వద్ద చేరడం వల్ల, దోమల కారణంగా తాము పడుతున్న ఇబ్బందులను ఈ ప్రాంతీయులు మునిసిపల్ అధికారులకు తెలిపినా పట్టించుకొనేవారే లేకుండా పోవడంతో అనారోగ్యానికి గురై ఆస్పత్రుల పాలవుతున్నామని వాపోతున్నారు. అలాగే పెద్దపవని రోడ్డు, పోలేరమ్మ ఆలయం వద్ద, వెంకటేశ్వర థియేటర్ వద్ద పారిశుధ్యం అధ్వాన్నంగా వుంటోంది. వర్షాకాలంలో పరిస్థితి మరింతగా దిగజారిపోతున్నందున మునిసిపల్ అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అందుబాటులోకి రాని అంగళ్లు!

పొదలకూరు నిమ్మయార్డులో కడగండ్లు

లక్షల రూపాయలు వెచ్చించి నిమ్మకాయల వ్యాపారస్తుల కోసం నిర్మించిన దుకాణాలు వినియోగంలోకి రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు పొదలకూరు నిమ్మ యార్డులో. నిమ్మ మార్కెట్‌కు స్థానిక రైతులే కాకుండా కలువాయి, రాపూరు, చేజర్ల, సంగం, ఆత్మకూరు మండలాల నుంచి నిమ్మకాయలను రైతులు తీసుకొని వస్తుంటారు. అందరికి అందుబాటులో వున్న ఈ మార్కెట్‌లోని వ్యాపారస్తులకు సరైన దుకాణాలు, వసతి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాపూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెన్ను బాలకృష్ణారెడ్డి స్థానిక నిమ్మ మార్కెట్ యార్డులో ఒక్కో కొట్టును 2.50లక్షల రూపాయలు వెచ్చించి మొత్తం ఆరు అంగళ్లను 15లక్షల రూపాయలతో నిర్మించారు. ఈ గదులను నిర్మించి మూడేళ్లు గడుస్తున్నా వ్యాపారస్తులకు అందుబాటులోకి తేకపోవడంతో అంగట్లో అన్నీ వున్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా వుంది వ్యాపారస్తుల పరిస్థితి. గదులులేక పలువురు వ్యాపారులు అవస్థలు పడుతున్నందున అధికారులు శ్రద్ధ వహించి లక్షలు వెచ్చించి నిర్మించిన అంగళ్లను వ్యాపారులు వినియోగించుకొనేలా చూడాలని పలువురు కోరుకొంటున్నారు.



విఘ్నాలను తొలగించి

శుభాలను ప్రసాదించే వినాయకుడు!

సందడి... సంబరం... ఆనందం... అనుభూతుల కలయికే పండుగ. అలాంటి పండుగలు ఎన్ని వచ్చినా భాద్రపద మాసంలో వచ్చే వినాయకచవితి పండుగకు ఒక ప్రత్యేకత వుంది. తాము తలపెట్టిన ఏ కార్యక్రమమైనా ఎలాంటి విఘ్నాలు లేకుండా చూడమని వినాయకుడిని పూజిస్తుంటారు. త్రిమూర్తుల తర్వాత విశేషంగా పూజ లందుకొనే దైవం వినాయకుడు. ఏ కార్యక్రమమైనా, ఏ పూజ అయినా నిర్విఘ్నంగా సమాప్తి కావడానికి విఘ్నేశ్వర పూజతోనే ఆరంభమవుతుంది. ప్రతి శుభకార్యంలో తొట్టతొలిగా ఆరాధింపబడే దైవమైన వినాయకుడు భాద్రపద శుక్ల చతుర్థినాడు జన్మించినట్లు పురాణాలు చెబుతుండడంతో ఆ రోజును వినాయకచవితిగా జరుపు కోవడం ఆనవాయితీ. ఈ పండుగను భాద్రపద శుద్ధచవితి నాడే ఎందుకు జరుపుకోవాలనే దానిపై ఋగ్వేదంలో వివరించబడి వుంది.

విఘ్నేశ్వరుడు అంటే విఘ్నాలకు నాయకుడు. విఘ్న గణాలను ఆయన తన ఆధీనంలో వుంచుకొని భక్తుల అవిఘ్నాలను తొలగించి శుభాలను ప్రసా దిస్తూ వుంటాడు. గణపతి వాహనం మూషికం. ఈ వాహనానికి ఒక ప్రత్యేకత వుంది. మన ఇళ్లలో వున్న పదార్థాలను మూషికం ఎలా కాజేస్తుందో, అలాగే విఘ్నేశ్వరుడి వాహనమైన ఎలుక జీవుల హృదయాల్లో వున్న అజ్ఞానాన్ని అపహ రిస్తుంది కాబట్టే మూషికాన్ని ఆయన తన వాహనంగా చేసుకొన్నట్లు పురాణాలు చెబుతున్నాయి. గణపతికి సర్వాంతర్యామి అయిన శివుడే మూషిక రూపం ధరిం చాడనీ చెబుతారు. వినాయకుడిది గజవదనం. చాటల్లాంటి చెవులు, చిన్న చిన్న కళ్లు కల్గిన ఆయన సర్పాలను ఆభరణాలుగా కల్గి వుంటాడు. గణనాథుని చిరు నేత్రాలు సూక్ష్మ బుద్ధికి సూచకంగా చెప్తారు. భక్తులు ఏ దిక్కు నుండి పిలిచినా అనగా అష్టదిక్కులోనే కాక ఊర్ధ్వ, అధో భాగాల నుండి పిలిచినా వారి మొరవిని ఆదుకొనే వినాయకుడిని పూజిస్తే విఘ్నాలు తొలగి సకల విద్యలు, సకల ఐశ్వ ర్యాలు సిద్ధిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.

వినాయకుని అవతారాల గురించి వివరణ వుంది పురాణాల్లో. వక్రతుండ, ఏకాదంత, మహోదర, గజానన, లంబోదర, విఘ్నరాజ, ధూమ్ర వర్ణ, వికటుడు అనే ఎనిమిది అవతారాలను ఎత్తినట్లు ముద్గల పురాణం తెలుపుతోంది. దేవత లలో అగ్రగణ్యుడైన గణపతిని అర్చించినట్లయితే వారికి ఆ స్వామి అనుగ్రహం లభించి కామక్రోధాలు నశించి ఆత్మజ్ఞానం సిద్ధిస్తుంది. ఇక వినాయక చవితినాడు పూరు, వాడా అనే తేడా లేకుండా అన్నిచోట్ల వినాయక విగ్రహాలను ప్రతిష్టించి తొమ్మిది రోజులపాటు పూజించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆ తర్వాత నిమజ్జనం చేస్తుంటారు. ఈ నిమజ్జనానికి ఒక కారణం వుంది. యంత్ర ప్రతిష్ట జరగనందున తాత్కాలికంగా ప్రతిష్టించిన విగ్రహాలను నదులలోగానీ, చెరు వుల్లోగానీ నిమజ్జనం చేయాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఎక్కువ రోజులు ఇలాంటి విగ్రహాలను అలాగే వుంచడం వలన ఆ విగ్రహాల రూపురేఖల్లో మార్పులు వచ్చి దోషం ఏర్పడుతుంది కాబట్టి నిమజ్జనం చేయాలని చెబుతోంది. అప్పటి వరకు తొమ్మిది రోజులపాటు ఎంతో వైభవంగా పూజలందుకొన్న వినాయక విగ్ర హాలు నీటిలో వదలగానే రూపురేఖలు కోల్పోయి నీటిలో కలిసిపోతాయి. జీవలం దరూ ఎంతటి వైభవమైన జీవితాన్ని చూసినా చివరకు ఆ పరమాత్మలో ఐక్యంకాక తప్పదనే తత్వం ఈ నిమజ్జనం ద్వారా తెలుస్తుంది.

లంచమిస్తే ఉద్యోగం

నర్సుల పోస్టులు ఇప్పిస్తామని...

బయలుదేరిన దళారులు!

జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా వున్న 31కి పైగా నర్సుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానించారు. మెరిట్ లిస్ట్‌లోని వారికి కొందరు దళారులు ఫోన్లు చేసి పోస్టింగులు ఖాయమని చెప్పూ డబ్బులు డిమాండ్ చేయడం వివాదాస్పదమయ్యింది.



నిత్యం ఏదో ఒక వివాదంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం.

వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో త్వరలో భర్తీ చేయనున్న నర్సు పోస్టుల కోసం పైరవీలు కొనసాగుతున్నాయి. కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్న 31 నర్సు పోస్టులకు దాదాపు 500కు పైగా దరఖాస్తులు స్వీకరించారు. మెరిట్ లిస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తా మని ఇప్పటికే అధికారులు ప్రకటించారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది, అధికారులు సకల జనుల సమ్మెలో వుండడంతో ఈ ఎంపిక ప్రక్రియ వాయిదా పడింది. సమ్మె ముగిసిన తర్వాత ఎంపిక చేసే అవకాశం వుంది. అయితే ఈ శాఖ కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ సీనియర్ ఉద్యోగి అప్పుడే పై రవీలు ప్రారంభించాడు. దళారి అవతారమెత్తి స్వీకరించిన దరఖాస్తుల్ని పరిశీలన జరిపి మెరిట్ వున్న వారిని గుర్తించి వారితో ఫోన్ ద్వారా చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది.

నర్సు పోస్టులకు వచ్చిన అన్ని దరఖాస్తుల్ని సక్రమంగా పరిశీ లించి నిబంధన ప్రకారం ముందుగా మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా సెలక్షన్ కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు చేసిన దగ్గర నుండి నర్సు పోస్టును దక్కించుకొనేందుకు వివిధరకాలుగా ప్రయత్నాలు ప్రారం భించారు. రాజకీయ నేతలు, అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలకు చెం దిన ఎమ్మెల్యేలను ఆశ్రయించి సిఫార్సు చేయాలని కోరుతున్నారు. దీనిని ఆసరా తీసుకొన్న కొందరు రాజకీయ దళారులు రంగ ప్రవేశం చేసి అభ్యర్థులకు వల విసురుతున్నారు. పోస్టింగ్ ఇప్పించే బాధ్యత తమ దంటూ నమ్మబలుకుతూ బేరసారాలు సాగిస్తున్నారు. ఒక్కో పోస్టుకు రూ 50వేల నుంచి లక్ష వరకు నిర్ణయిస్తున్నారు. నమ్మకం కలిగించేం దుకు జిల్లామంత్రి, ఎమ్మెల్యేల పేర్లను వినియోగిస్తున్నారు.


రాజకీయ దళారులకంటే తాము ఏ విధంగా తీసిపోమని వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి రంగంలో దిగాడు. ఈ శాఖ ఉన్నతాధికారులతో సన్నిహిత సంబంధాలున్నాయంటూ చెప్పుకుంటున్నాడు. మెరిట్ కలిగి వున్న అభ్యర్థుల మొబైల్ నెంబర్ సేకరించి నేరుగా వారితో మాట్లాడి ఉద్యోగం ఇప్పిస్తానని భరోసా ఇస్తున్నాడు. కార్యాలయంలో పని చేస్తున్న ఉద్యోగి నేరుగా ఫోన్ చేసి మాట్లాడడంతో కోట మండలానికి చెందిన ఓ అభ్యర్థిని లక్ష రూపాయలు ముట్టచెప్పేందుకు సిద్ధపడినట్లు సమా చారం. నమ్మకం కలగకపోతే బ్యాంకులో జాయింట్ ఖాతా ప్రారం భించి నగదు జమ చేసే విధంగా ఒప్పందం చేసుకుంటున్నారు. మెరిట్ వున్నవారు దళారులను ఆశ్రయించినా, ఆశ్రయించకపోయినా ఎంపిక కాబడతారు. అయితే మెరిట్‌లో వున్న విషయం వారికి తెలియకుండా సిబ్బంది జాగ్రత్తపడి పైరవీలు చేసుకుంటున్నారు.

ఈ ఉద్యోగితో పాటు డిఎంఅండ్‌హెచ్ఓతో మరింత సన్నిహి తంగా మెలిగే మరో ఉద్యోగి కూడా నర్సు పోస్టు ఇప్పిస్తానని ప్రచారం చేసుకొంటున్నాడు. నిత్యం అధికారితో తిరుగుతూ అందరికి కనిపిస్తుండ డంతో అభ్యర్థులు నమ్మాల్సి వస్తుందని అంటున్నారు. అధికారి మెతక వైఖరిని అలుసుగా తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణ లున్నాయి. నర్సు పోస్టు ఎంపికలో ఎటువంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత డిఎంఅండ్ హెచ్ఓపై వుంది. లేకుంటే అధికారి పేరు చెప్పి దండకాలు చేసుకుని శాఖ పరువు తీసే వారు పలువురుంటారు.

● సోమశిల నుంచి కండ్లేరుకు నీటి విడుదల

నెల్లూరుజిల్లాను ఎండబెట్టి చిత్తూరుజిల్లాను పండించుకోవాలనే ప్రయత్నం!

- సోమశిల ప్రాజెక్ట్‌లో 45 అడుగుల నీరు చేరాక మాత్రమే కండ్లేరుకు నీరు వదలాలి.
- మద్రాసు వాళ్లు నీళ్లు వదలమని అడగలేదు.
- శ్రీకాళహస్తి, సత్యవేడు తాలూకాల్లో పంట పండించను సిఎం వేసిన ఎత్తుగడ ఇది.
- నెల్లూరు జిల్లా నేతల్లో నిరుత్సాహమెందుకో అర్థం కావడం లేదు.



కృష్ణా నదికి ఈ ఏడాది ముందుగానే వరద వచ్చింది. జూలైలోనే శ్రీశైలం రిజర్వాయర్ నిండింది. నాగార్జునసాగర్ గేట్లు కూడా కొద్దిగా ఎత్తారు. నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజ్‌ల మధ్య సైతం వానలు విస్తారంగా కురవడంతో కృష్ణ నీరు చాలానే సముద్రానికి వెళ్లింది. ఇంత త్వరగా కృష్ణ నీరు సముద్రంలో సంగమించే దృశ్యం జూలై, ఆగష్టు నెలలోనే చూసి చాలా కాలమైంది.

సోమశిల, కృష్ణ వరద నీటి ఆధారంగా నిర్మించిన రిజర్వాయర్. కానీ ఒక ప్రక్క శ్రీశైలం పొంగి పొర్లుతున్న సోమశిలకు మాత్రమే నీరు రాలేదు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కట్టించిన 40 వేల క్యూసెక్కుల పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ప్రయోజనం ఏ మాత్రం నెల్లూరు జిల్లాకు దక్కలేదు. ఆ రెగ్యులేటర్ నుంచి సోమశిలకు నీరు రావడానికి వున్న ఏకైక మార్గం – నిప్పుల వాగు. రెగ్యులేటర్‌ను 40వేల క్యూసెక్కులకు పెంచారే తప్ప, నిప్పుల వాగును సహజ సిద్ధంగా వుండే 4వేల క్యూసెక్కుల స్థాయిలోనే వదిలేశారు. రెగ్యులేటర్‌తో పాటు ఆ వాగును కూడా విస్తరించి వుంటే, సోమశిల మీదుగా కృష్ణ వరద ప్రవహించిన పాతిక ముప్పై రోజుల వ్యవధిలో సోమశిల సగం పైన నిండి వుండేది. కానీ అది జరగలేదు.

అయినాసరే ఇప్పుడు సోమశిలలో 21టిఎంసిల నీటి నిల్వ వుంది. ఇది కుందు నది వరద వల్ల వచ్చి చేరిన నీటి ప్రవాహం. కర్నూలు జిల్లాలో ప్రవహించే కుందు నదికి వారం రోజుల పాటు వరద వచ్చింది. దాని నీటికి గమ్యం సోమశిల మాత్రమే. సోమశిలకు ఆగష్టు నెలలోనే ఈ మాత్రం నీరు చేరడం నెల్లూరు జిల్లా రైతుల అదృష్టం. మామూలుగా అయితే అక్టోబర్, నవంబర్ నెలలో వచ్చే తుఫాన్ల ద్వారా మాత్రమే పెన్న పారుతుంది. ముందుగానే నీరు వచ్చాయి కాబట్టి, ముందుగానే నాట్లకు నీరు వదులుతారని పెన్నా డెల్టా రైతులు ఆశ పడడం సహజం. 20టిఎంసిల నీరంటే, ఒకవేళ తుఫాన్లు రాకపోయినా సరైన నిర్వహణ పద్ధతులు పాటిస్తే మొత్తం డెల్టాకు ఈ పంటకు ఈ నీరు సరిపోతుంది.

అయితే విచిత్రంగా సోమశిల నీటిని కండ్లేరుకు తరలించాలని ఆదేశిస్తున్నారు ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు. హైదరాబాద్ నుంచి ఒత్తిడి పెంచుతున్నారు. కండ్లేరు ద్వారా మద్రాసుకు నీరు ఇవ్వడం అంతర్ రాష్ట్ర ఒప్పందం. దాన్ని పాటించాలి. అయితే అందుకు కొన్ని నియమాలున్నాయి. సోమశిలలో 45 అడుగుల స్థాయికి నీటి నిల్వ చేరినప్పుడు మాత్రమే కండ్లేరుకు విడుదల చేయాలి. ఆ ఎత్తులో దాదాపు 37 టిఎంసిల నీటి నిల్వ చేరుతుంది. ఆ స్థాయి వరకు నీటి మీద హక్కు డెల్టా రైతాంగానిది. అంతకు మించిన స్థాయి వచ్చినప్పుడు మాత్రమే కండ్లేరు ద్వారా మద్రాసుకు మంచి నీరివ్వాలనేది షరతు. అందుకు విరుద్ధంగా, మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం తమకు నీరు వదలాలని అడగక ముందే సోమశిల నీటి తరలింపుకు హైదరాబాద్ నుంచి ఎందుకు ఫోన్లు వస్తున్నాయి అన్నది ప్రశ్న. నిజానికి ఈ ఏడాది మద్రాసు నగరంలో కూడా విస్తారంగా వానలు కురిశాయి. వారి మంచినీటి రిజర్వాయర్లు నిండుగా వున్నాయి. కండ్లేరు నీరు ఇప్పటికిప్పుడు వారికి అత్యవసరం కాదు. డిసెంబర్ నెల తర్వాత కండ్లేరు నుంచి తీసుకోవడం వారికి సౌకర్యం. అయినా సరే సోమశిల నీరు తరలించండని హుకుం జారీ చేస్తున్నారు అధికారులు.

అందుకు కారణం – మద్రాసు మీద ప్రేమ కాదు, చిత్తూరు మీద అభిమానం. కండ్లేరు మీదుగా శ్రీకాళహస్తి, సత్యవేడు తాలూకాలలో 50వేల ఎకరాలకు సాగు నీరు, శ్రీకాళహస్తి, తిరుపతి పట్టణాలకు త్రాగు నీరు ఇచ్చే సదుపాయం వుంది. ఆ వసతిని వాడుకోవడానికి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నం వల్లనే సోమశిల నుంచి నీటి విడుదలకు తొందర పెడుతున్నారు హైదరాబాద్ అధికారులు. సోమశిల నీటి విడుదలకు సాంప్రదాయం ప్రకారం ఐఎబి సమావేశం జరపాలి. ఏ కాలువలకు, ఏ డెల్టా ప్రాంతానికి ఎంత నీరు ఎప్పుడెప్పుడు ఇవ్వాలో ఆ సమావేశంలో నిర్ణయం చేయాలి. అప్పటివరకు ఏ అధికారికి కూడా సోమశిల గేట్లు ఎత్తే అధికారం లేదు. ఆ సాంప్రదాయాన్ని విస్మరించి కండ్లేరు కాలువలకు నీరిమ్మని తొందర పెట్టడం అంటే, నెల్లూరు జిల్లా ఎమ్మెల్యేలు చేవలేని దద్దమ్మలని ముఖ్యమంత్రికి స్థిరమైన నమ్మకం ఏర్పడి వుందన్న మాట. అందువల్లనే ఆయన ఎవరినీ సంప్రదించకుండా నెల్లూరు జిల్లాను ఎండబెట్టి, చిత్తూరు జిల్లాను పండించుకోవాలని ప్రయత్నం చేస్తున్నాడు.

ఇది అన్యాయం. మద్రాసు నీటికి తొందర లేదని తెలిసీ సోమశిలను ఖాళీ


కొరవ 14వ పేజీలో




డాక్టర్ జెట్టి శేషారెడ్డి కుమార్తె మేఘన, డాక్టర్ ఆదర్శ్‌ల వివాహం ఆగష్టు 29తేది నెల్లూరు మినీబైపాసురోడ్డులోని అనిల్ గార్డన్స్‌లో జరిగింది.



డాక్టర్ ఆమంచర్ల దుర్గాప్రసాద్ కుమార్తె నాగిని, రజనీష్‌ల వివాహం ఆగష్టు 25తేది నెల్లూరులోని వాయుగుండ్ల బ్రహ్మయ్య కళ్యాణ మండపంలో జరిగింది.



ముత్తుకూరు రోడ్డులో కొత్తగా కట్టిన కెజికె కళ్యాణ మండపం అధినేత కాటంరెడ్డి గోపాలకృష్ణారెడ్డి కుమార్తె వంశీ ప్రియరెడ్డి, మహేష్‌రెడ్డిల వివాహం వారి కళ్యాణ మండపంలోనే ఆగష్టు 29తేది జరిగింది.



అల్లీపురం వాస్తవ్యులు గౌరినేని శ్రీనివాసులు మేనకోడలు వినీష, సందీప్ చౌదరిల వివాహం ఆగష్టు 30తేది నెల్లూరు సిపిఆర్ కళ్యాణ మండపంలో జరిగింది.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

గతవారం వలె వుండి తలపెట్టిన పనులలో భంగపాటు వుంటుంది. పట్టుదలలకు పోవద్దు. అవమానాలు ఎదురుకావచ్చు. మిత్ర, శత్రుత్వ భేదాలు గమనించలేరు. సమస్యలకు గట్టి ప్రయత్నం చేయండి. ఉద్యోగులకు తమ సహచరులతో అభిప్రాయ భేదాలు పెరుగు తాయి. మాతృ పితృవర్గాల సంబంధమైన చర్చలు వస్తాయి. అన్ని రంగాల వారికి గట్టి ప్రయత్నపూర్వక ధనలాభాలుంటాయి.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశిర 1,2 పా

నూతన వ్యాపకాలు, నూతన వ్యాపారాలకై ప్రయత్నాలు వుం టాయి. ఉద్యోగులు స్థానచలనాన్ని ఆశిస్తారు. విద్యార్థుల మనోభీ ష్టాలు నెరవేరుతాయి. సోదరవర్గంతోగానీ, జాయింట్ వ్యవహారా లలో గానీ సమస్యలు రేకెత్తుతాయి. రాజకీయ నాయకులు మౌనం వీడనంత వరకు రాజయోగమే. కుటుంబంలో తలచిన పనులు బంధుమిత్రుల సహకారంతో పూర్తవుతాయి.



మిథునం
మృగశిర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

రుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. శుభకార్యాచరణకు రంగం సిద్ధమౌ తుంది. ఇంటాబయట సంజాయిషీలిచ్చుకోవాలి. సోదరమైత్రి పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో చేసిన కృషికి ఫలితం లభి స్తుంది. అనవసరకలహాల జోలికి వెళ్లవద్దు. దూర ప్రయాణాలు యోగించవు. వృత్తి, వ్యాపార, ఉద్యోగాలలోని వారికి ఆందోళనలు తప్పవు. కుటుంబ వ్యక్తులతో దైవదర్శనం చేస్తారు.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

నూతన వ్యవహారాలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో వేగం తగ్గిం చుట మంచిది. ఉద్యోగులకు చీకాకులు, ప్రయాణాలు అధికమౌ తాయి. వ్యవసాయ, కళా, క్రీడాకారులకు సామాన్య ధన లాభం. కార్మిక వర్గాలు పోరాటపటిమ చూపుతాయి. రాజకీయులు మాట్లా డేటప్పుడు, ప్రయాణాలలో జాగ్రత్తలవసరం. పాత కేసులు వ్యవహా రానికి వస్తాయి. విలువ గల వస్తువులు ఖరీదు చేస్తారు.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

సాహస నిర్ణయాలు వద్దు. మానసిక ఒత్తిడి వుంటుంది. సంతాన సౌఖ్యం వుంటుంది. నూతన నిర్ణయాలు వాయిదా వేయడం మం చిది. వృత్తి, వ్యాపారాలలో ఆర్థిక నిర్ణయాలు తగ్గుతాయి. శుభకార్య చర్చలు వాయిదాపడతాయి. స్వయం వృత్తుల వారికి అభివృద్ధి. వ్యవసాయదారులు ఆందోళన పడవద్దు. ఉద్యోగ స్థానాలలో అని శ్చితి వుంటుంది. రుణ సమస్యలు వస్తాయి.



కన్య
ఉత్తర 2,3,4పా, హస్త, చిత్తా 1, 2 పా

తలపెట్టిన పనులలో ఏకాగ్రత, పట్టుదలలు పెరుగుతాయి. అలం కారాలకు, ఆధునిక వస్తువులు కొంటారు. దాయాది వర్గాలతో విభే దాలుంటాయి. వృత్తి, వ్యాపారాలలో మిశ్రమ ఆదాయాలుంటాయి. ఇతరులతో అకాల కలహాలు. విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటిం చాలి. ఇతరులతో, విదేశీయులతో మైత్రి లభిస్తుంది. కళ, క్రీడాకా రులు ఇతర వర్గాల వారు సమయస్ఫూర్తిని ప్రదర్శించలేరు.

వారఫలాలు

తేది 7-9-2013 నుండి 13-9-2013 వరకు
మేషంలో కేతువు; మిథునంలో గురువు;
కర్కాటకంలో కుజుడు; సింహంలో రవి; కన్యలో
బుధుడు; తులలో శుక్ర, శని, రాహువులు; కన్య,
తుల, వృశ్చిక, ధనుస్సులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

7తేది జిల్హాజ్ నెల ప్రారంభం.
8తేది హరితాళికావ్రతం, షోడశోమావ్రతం, వరాహ జయంతి.
9తేది వినాయక చవితి.
10తేది ఋషి పంచమి, బౌద్ధ జయంతి.
11తేది సూర్యషష్టి.
12తేది ఆముక్తాభరణ వ్రతం, మహాలక్ష్మీ వ్రతం ప్రారంభం.
13తేది రాధాష్టమి – కేదార వ్రతం, నందన నవమి. ఉత్తరాకార్తె ప్రారంభం.

శుభ ముహూర్తాలు

భాద్రపదమాసం శూన్యమాసం కావున వివాహాది శుభముహూర్తాలు లేవు. సీమంత, అన్నప్రాసనాది సామాన్య విషయాలకు ముహూర్తాలున్నాయి.

సెప్టెంబర్ తిథులు
భాద్రపద శుద్ధ

7	శని	విదియ	సా	05.16 గం.ల.వ
8	ఆది	తదియ	సా	04.47 గం.ల.వ
9	సోమ	చవితి	సా	03.38 గం.ల.వ
10	మంగళ	పంచమి	ప	02.49 గం.ల.వ
11	బుధ	షష్టి	ప	01.22 గం.ల.వ
12	గురు	సప్తమి	ప	11.36 గం.ల.వ
13	శుక్ర	అష్టమి	ప	09.33 గం.ల.వ

అక్కరాజు బాలసుబ్రహ్మణ్యం
7/34, దొడ్ల సుబ్బారెడ్డి నగర్, నవలాకులతోట, నెల్లూరు – 2. సెల్: 95819 76599.



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

ఇతరులతో మెలిగేటప్పుడు జాగ్రత్తలవసరం. మిమ్మల్ని స్తుతించి ధనాన్ని పొందుతారు. బంధువుల రాక విస్మయం కలిగిస్తుంది. పరో పకార మార్గం అవలంభిస్తారు. కోర్టు వ్యవహారాలలో న్యాయ సల హాలు తీసుకోవడంలో పలు జాగ్రత్తలవసరం. ధనం విషయంలో నిక్కచ్చితనం పాటించటం మేలు. సంతానం మీకు చేయూతనిస్తుంది. పిల్లల వైవాహిక జీవితాన్ని విచారించి ముందుకు పోవడం మంచిది.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

పెద్దల మాటలు శిరసావహిస్తారు. స్పెక్యులేషన్‌లో స్వల్ప వృద్ధి. కీర్తి ప్రతిష్టలలో పలు సమస్యలున్నాయని గ్రహించలేరు. దీర్ఘాలోచనలు చేసి పలు సమస్యలు ఎదుర్కొంటారు. వివాదాలలో తలదూర్చ వద్దు. వాహన సౌఖ్యం తగ్గుతుంది. ఆర్థికనష్టాలు చవిచూస్తారు. ప్రయాణ భంగం. ఇక్కట్లు కలుగవచ్చు. భూ సంబంధమైన పేచీలు రావచ్చు. పితృవర్గం నుండి వ్యతిరేకత రావచ్చు.



ధనుస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

తలపెట్టిన వ్యవహారాలలో నీచ ఆలోచనలు చేయవద్దు. జీవన స్థితిపై మెరుగైన ఆలోచనలు చేయండి. త్వరలో శుభవార్తలు విం టారు. స్పెక్యులేషన్ వద్దు. స్థిరలావాదేవీలు లాభిస్తాయి. ఉన్నత వ్యక్తు లతో కార్యసిద్ధి, కొన్ని ముఖ్య ప్రయోజనాలు పొందగలరు. వృత్తి, ఉద్యోగ, వ్యాపార, విద్యలలో సామాన్య ధన యోగం. స్థలమార్పులు జరుగుతాయి. ఇంటి విషయాలలో కొన్ని మార్పులు వస్తాయి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

గ్రహస్థితి సామాన్యంగా వుంటుంది. ఏకాగ్రతతో కృషిచేసిన మీ ఆశ యాలు తప్పక నెరవేరుతాయి. ఆకస్మిక ఖర్చులుంటాయి. బంధువుల రాకవల్ల అశాంతికి లోనౌతారు. భాగస్వామిని ఎన్నుకోవడంలో తొందరపాటు తగదు. ప్రేమ దాంపత్య విషయాలలో పొరపాట్లు దొర్లకుండా చూసుకోండి. వృత్తి, వ్యాపారాలలో ఆర్థికలాభం చూస్తారు. కొన్ని విషయాలలో చేదు అనుభవాలు చవిచూస్తారు.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

కఠిన నిర్ణయాలు, మాటల వల్ల లేనిపోని చిక్కులు తెచ్చుకొంటారు. బంధుమిత్రులతో సామరస్యంగా సంభాషించండి. వ్యక్తిత్వ లోపాలు లేకుండా జాగ్రత్తపడండి. గత విషయాలు తరచూ గుర్తుకొస్తాయి. స్థిమితంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోండి. తలపెట్టిన పనులు మందగిస్తాయి. అధిక ఒత్తిడి, ధన వ్యయం. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి. కోర్టు వ్యవహారాలు అనుకూలం.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

తలపెట్టిన కార్యక్రమాలు సజావుగా సాగి ధనార్జన పొందుతారు. కొత్త విషయాలు తెలుసుకొని ప్రయోగాలు చేస్తారు. వృత్తి, వ్యాపార లావాదేవీలు రాణిస్తాయి. అధిక ధన రుణబాధలు తప్పవు. ధైర్యంతో ముందుకు సాగుట మంచిది. వృత్తి, ఉద్యోగాలలో ఆటుపోట్లు వస్తాయి. రాజకీయులకు పదవి యందు కీర్తి వస్తుంది. అయితే కొన్ని విషయాలలో భయాందోళనలు వుంటాయి.

యంత్రం ఓంకార స్వరూపం, మహిమోపేతం! దుష్టశక్తి విఘాతం!!

మహ్మద్ ఇక్బాల్ సికింద్రాబాద్

** 'యంత్రం' గృహస్తునకు ఏ విధంగా మేలు చేస్తుంది?*

'యంత్రం' దేవతా స్వరూపమని వాస్తు శాస్త్రాలు చెబుతున్నాయి. ఓంకార రూపమని యంత్ర సారస్వతం చెబుతున్నది. అన్ని గృహ సమ స్యలను యంత్రాలు పరిష్కరిస్తాయన్నది భరద్వాజ మహర్షి ఉవాచ!

శ్రీమతి వేళాంగిణి నెల్లూరు

** 'యంత్రం' శక్తివంతమెలా అవుతుంది?*

మంత్ర బీజాక్షర సమన్వితమైన యంత్రానికి అభిషేక, అర్చన, బలి, పరిహారాది నియమాలు పాటించడం వల్ల యంత్రం శక్తిని పుంజుకొని, మంత్రాక్షరాలతో శక్తివంతమవుతుంది.

చిరం మస్తాన్‌రెడ్డి వింజమూరు

** మీరెన్ని అయినా చెప్పండి. శాస్త్రంలో చాలా లోటుపాట్లున్నాయి?*

ఆ మాట నేనొప్పుకోను. వేశ్య ఎదురు రావడం మంచిదని, విధవ వస్తే అశుభమని చెప్పారు. ఆ అం శం పూర్వం సామాజిక పరిస్థితులను బట్టి పాటిం పులోకి వచ్చింది. మీకిష్టం లేకపోతే పాటించకండి.

పి.సి.రెడ్డి కోవూరు

** రాహుకాల గణనలో లోటు పాట్లున్నాయా?*

ప్రస్తుతం పాటిస్తున్నది తమిళ సాంప్ర దాయం. సశాస్త్రీయంగా అయితే చాలా తేడా వస్తుంది. ఉదాహరణకు ఆదివారం రాహుకాలం 'ప్రజ్ఞాసింధు' గ్రంథ ప్రకారం సాయంత్రం 5 గం టల నుండి 6.42 వరకూ. సుప్రసిద్ధ పండితులు దీన్ని ఆమోదిస్తున్నారు కూడా. వాడుకలో సాయం త్రం 4.30 నుంచి 6.00 గంటల వరకు మనం పాటిస్తున్నది తప్పే!

కె.వి.ఆర్ ముత్తుకూరు

** ఆవిడ మహా ఛాందసురాలు. కొందరు పూజారులు తెలుసు. ఫోన్ ఎత్తుకుందంటే అన్ని విషయాలు అడుగుతుంది.*

ఫోన్లో శాస్త్ర విషయాలు వెంటనే వాళ్లు ఎలా చెప్పగలుగుతారో నాకూ అర్థం కావడం లేదు. అట్లా వెంట వెంటనే చెప్పడమూ భావ్యం కాదు. అవతలి వ్యక్తిని గమనించి మాట్లాడకపోతే అక్కడ కొందరు వ్యక్తులు ఆమె బారినపడి నలిగిపోయే పరిస్థితి దాపురిస్తుందని వారు గమనించాలి.

ఎం.ఉషాసింగ్ సికింద్రాబాద్

** జ్యోతిషశాస్త్రంలో చాలా ఛాందసాలున్నాయి. మీరెందుకు వాటిని ఖండించరు?*

మూల గ్రంథాలలో ఛాందసాలున్నాయంటే నేను ఒప్పుకోను. మన ఆచార వ్యవహారాలలో చాలా భాగం ఒక కుల వర్గం తమ స్వార్థం కోసం ఏర్పాటు చేసినవే. ప్రజలు వీటిని విశ్లేషించుకో నంతకాలం వాళ్లు ప్రజల్ని మోసగిస్తూనే వుంటారు.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

డి.ప్రతిమ హైదరాబాద్

** జ్యోతిష సిద్ధాంతంలో తారలు ప్రభావాన్ని కలిగి వున్నాయంటారా?*

ఈ అంశంపై అమెరికా శాస్త్రీయ కేంద్రం 'నాసా' కొన్ని నిర్దుష్టమైన అంశాల్ని వెల్లడించింది. అందువల్ల జ్యోతిషాన్ని ప్రపంచమంతా అంగీక రిస్తున్నది.

వి.రఘు చెన్నై

** జల ప్రళయం వచ్చి భూమి అంతమైపో తుందా?*

కశ్యప వాస్తులో ఒక సూక్తం వుంది. దాని ప్రకా రం మనిషి దుష్టమైన చేష్టలు వివిధ రూపాల్లో జీవ జాలాన్ని అంతం చేస్తుందని దాని అర్థం. ఇప్పు డున్న కాలుష్యం, ప్రకృతి వనరుల విచ్చలవిడి విని యోగం ఈ విషయానికి అద్దం పడుతున్నది కదా?

అ.నాగార్జున బెంగుళూరు

** 'యంత్రం' ఎలా శక్తివంతం అవుతుంది?*

దీపం, ధూపం, నైవేద్యాలతో సాత్విక బలు లతో యంత్రం శక్తివంతమవుతుంది. ప్రాణస్థితి ఆవాహన వల్ల మంత్రాక్షరాలు జీవాన్ని పోసుకుని 'ఓం'కారం శక్తిని పుంజుకొంటుంది.

ఎల్.చంద్రసేన్‌రెడ్డి ఖమ్మం

** వెంకటేశ్‌లో 'టో'ని 'టీ'చేస్తే అద్భుత విజయాలు సాధిస్తారని అతను చెప్పాడు.*

అక్షరాల్ని ఇలా 'కసరత్తులు' చేయిస్తే జీవి తాలు మారితే అందరూ అలా చేసుకోరా? నిజా యితీగా ఆలోచించండి. మోసపూరిత మాటలు నమ్మకండి.

వివాదంలో రెడ్‌క్రాస్ కుక్కకాటు టీకా విభాగం!

నెల్లూరు మద్రాస్ బస్టాండ్ వద్దగల రెడ్‌క్రాస్ సొసైటీలోని కుక్కకాటుకు టీకావేసే విభాగాధిపతిగా ఆర్ఎంపి విధులు నిర్వహిస్తున్నాడు. వైద్య శాఖ నిబంధనల ప్రకారం ఆర్ఎంపి సూది వేయడం చెల్లదు. ఈ విషయం డిఎంఅండ్‌హెచ్ఓ తనిఖీలో బయటపడడం విశేషం.



నెల్లూరులోని రెడ్‌క్రాస్ భవన ప్రాంగణం.

నెల్లూరు రెడ్‌క్రాస్ సొసైటీలో మళ్లీ వివాదం రేగింది. కుక్కకాటుకు సూది మందు వేసే విభాగంలో ఒక ఆర్ఎంపి విధులు నిర్వహించడం వివాదాస్పదమయ్యింది. గత 13 సంవత్సరాల నుండి కుక్క కాటుకు సూది మందు వేసే(విఆర్‌వి) విభాగంలో ఆర్ఎంపి పనిచేస్తున్నాడు. వైద్య శాస్త్ర నిబంధనల ప్రకారం ఆర్ఎంపి చేత సూది మందు వేయించరాదు. సాక్ష్యాత్తూ ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే రెడ్‌క్రాస్ సొసైటీలో ఆర్ఎంపిని ఎలా నియమించారన్నది ప్రశ్నగా మారింది. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.సుధాకర్ జిల్లా వ్యాప్తంగా ఆర్ఎంపిలు నిర్వహిస్తున్న క్లినిక్‌లను మూసివేయించిన సంగతి తెలిసిందే.

ఈ క్రమంలో రెడ్‌క్రాస్‌లో నిర్వహించే విఆర్‌వి విభాగంలో కూడా డిఎంఅండ్‌హెచ్ఓ తనిఖీలు నిర్వహించగా ఆర్ఎంపి విషయం బయట పడింది. గత పాలకవర్గం హయాంలో ఆర్ఎంపి నియామకం జరిగింది. ఒక మహిళకు హెచ్ఐవి రక్తం సరఫరా చేయడంతో రెడ్‌క్రాస్ వ్యవహారం తెరపై కొచ్చింది. జిల్లావ్యాప్తంగా పెద్ద దుమారం రేగడంతో ప్రభుత్వం స్పందించి పాలకవర్గాన్ని రద్దు చేసింది. అంతర్జాతీయంగా పేరు ప్రఖ్యాతులున్న రెడ్‌క్రాస్ పరువు బజారున పడడంతో అధికారులకు బాధ్యతలు అప్పగించింది ప్రభుత్వం. జిల్లా జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో నలుగురు అధికారులను విభాగాల వారీగా నియమించారు. ఆ బాధ్యతలు తీసుకున్న అధికారులకు పని భారం అధికం కావడంతో రెడ్‌క్రాస్‌కు సమయం కేటాయించలేక పోతున్నారు.

విఆర్‌వి విభాగంలో వుండే ఆర్ఎంపి ఇక్కడకు వచ్చే కొన్ని కేసులను మాజీ కార్యదర్శి నిర్వహించే ఆసుపత్రికి పంపే వారన్న ఆరోపణలు వున్నాయి. డిఎంఅండ్‌హెచ్ఓ తనిఖీలో ఆర్ఎంపిని గుర్తించి జాయింట్ కలెక్టర్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఆయన ఆర్ఎంపిని తొలగించాలని ఆదేశించారు. ఆర్ఎంపిగా వున్న రమణయ్య ఆర్ఎంపి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. దీనికి ఎటువంటి చట్టబద్ధత లేకపోయినా ఆర్ఎంపి వైద్యుడిగా ఈయన ధృవీకరణ పత్రాలు అందజేసి భారీ మొత్తంలో సొమ్ము చేసుకున్నారన్న ప్రచారం జరుగుతుంది. ఆర్ఎంపిని రెడ్‌క్రాస్ విఆర్‌వి విభాగంలో నియమించారన్న సంగతి బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ విషయం లీకైంది.

తొలగించిన ఆర్ఎంపి స్థానంలో ఎంబిబిఎస్ వైద్యుడితో త్వరలో భర్తీ చేయనున్నారు. ఇదిలా వుండగా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌పై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. బయట ప్రాంతాల్లో రక్త సేకరణ కోసం నిర్వహించే శిబిరం నుంచి సేకరించిన రక్తాన్ని సక్రమంగా పరీక్షలు చేయలేక పోతున్నారు. వెయ్యి మంది నుండి రక్తం సేకరిస్తే అందులో పది మందికి హెచ్ఐవి పాజిటివ్ వుండే అవకాశం వుంటుందని వైద్యులు చెబుతున్నారు. రెడ్‌క్రాస్‌లో రక్త పరీక్షలు నిర్వహించి వుంటే హెచ్ఐవి సోకిన వారిని గుర్తించి, వారి నుండి సేకరించిన రక్తాన్ని అధికారుల సమక్షంలో ధ్వంసం చేయాలి. మాజీ కార్యదర్శి హయాం నుండి సక్రమంగా రక్త పరీక్షలు చేయడం లేదు. చేసి వుంటే మహిళకు హెచ్ఐవి రక్తం సరఫరా చేసేవారు కాదని వాదన వినిపిస్తుంది.

సరైన రక్త పరీక్షలు చేయకపోవడం కారణంగా రోగులకు సరఫరా చేసే రక్తంలో హెచ్ఐవి, హెపటైటిస్ – బి కూడా వెళుతున్నట్లు అనుమానిస్తున్నారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంకు ఇన్‌ఛార్జి అధికారిగా ఎయిడ్స్ నోడల్ అధికారి డాక్టర్ పద్మావతి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈమె బ్లడ్ బ్యాంక్‌కు ప్రత్యేక దృష్టి సారించలేక పోవడం వల్ల సేకరించిన రక్తానికి పరీక్షలు చేయకుండా వదిలేస్తున్నారు. ఎయిడ్స్ నోడల్ అధికారిగా ఈమెకు అనుభవం వుండడంతో బ్లడ్ బ్యాంకు ఇన్‌ఛార్జ్‌గా అప్పటి కలెక్టర్ శ్రీధర్ నియమించారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్లడ్ బ్యాంకు, విఆర్‌వి విభాగాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రజలకు మరింత దగ్గర చేసేందుకు కృషి చేయాల్సిన అవసరం వుంది.



భాగ్యనగర్‌లోని బేవర్సుగార్లకెంత భక్తో



ఫ్యూనికాగ్రేని ఏటమ్, ఓరిగానమ్ మారిజోనమ్, ఎరాగ్రాసిస్ సైనోసురాయిడ్స్, ఎవాల్యువస్ హిర్సుటస్, దతుర హూమ్మాటు, సెనోలాన్ డాక్టిలాన్, అచిరాంతెస్ యాస్‌పెరా, ఎగ్లిమారా మెలాస్, కెలాట్రోపిస్ ప్రోసిరా, బహునియా వేరిగేటా, జిజిల్ బస్‌జుబిబస్, పైనస్‌లాంగిఫోలియా, మిరిస్టి కాఫ్రాగ్రాన్స్, ఫోర్ కోవా కేంటెల్లా, మైమోసా సుమా, హైబిస్కస్ సైనిసస్, వహానియా స్పికాటా, ఆర్టిమిసియా ఇండికా, ఫ్రెష్ స్రవుట్, అగుల్లేసియా అగహోచ, శాండల్ పేస్ట్. ఇవేమిటో తెలుసా? గోవులెల్లుండి రానున్న వినాయకచవితి నాడు స్వామికి అర్పించి అర్చించే పత్రి. 1.దానిమ్మ, 2.మరువమ్ము, 3.దర్భ, 4.విష్ణుక్రాంత, 5.ఉమ్మెత్త, 6.దుర్వార, 7.ఉత్తరేణి, 8.గరగరా – మారేడు, 9.జిల్లేడు, 10.దేవకాంచన, 11.రేగు, 12.దేవదారి, 13.జాజి, 14.బలరక్కసి, 15.జమ్మి, 16.దాసాని, 17.ఆరె, 18.మాచిపత్రి, 19.మంచి మొలక, 20.అగరు, 21.గంధం. పైన వ్రాసిన ఆంగ్లపదాలు, బాటనీ లెక్చరర్లకు; 'ఆయుష్' విద్యార్థులకు, వారి గురువులకు, వీటితో మందులను ఉత్పత్తి చేసే కంపెనీల్లోని చిన్న, పెద్ద ఉద్యోగులకు, మందుల షాపు యాజమాన్యానికి, జిజ్ఞాస గల వారికి, పురాతన గ్రంథాలు చదివి, వాటి పనితనాన్ని గ్రహించి, ఆయా రంగాల్లోని నా బోటి వారికి(రోగుల కొరకై ఏళ్ల తరబడి రీసర్చిచేసి 2, 3 వ్యాధులకు ఉపయుక్తమైన వాటిని కనుగొన్న)తెల్సు. కానీ వీటిని అమ్మే షాపులమీద అజమాయిషీ చెలా ఇంచే వారికి, ఆ ఇన్‌స్పెక్టర్లపై నున్న అధికారులకు లైసెన్సులిచ్చే రాష్ట్ర లెవల్లోని ఆఫీసుల్లో వుండే ఆఫీసర్లకు, కమీషనర్ స్థాయి వారికి, వీరందరిపై పెత్తనం చలా ఇంచే ఆ శాఖ అమాత్యవర్యులకు మాత్రం ఏమీ తెలియదు. ఎన్నో ఏళ్లుగా మామూళ్లు మరిగి మర్చిపోయారు. నాకూ లైసెన్సుంది 97 నుండి. ఏదో కొద్ది మందికి క్లినిక్‌లోనే ఇచ్చుకోవచ్చు గనుక. తొలుత బయట మార్కెటింగ్ చేశాను. అయితే రూల్సని, రెనివల్సని, వ్యాపారం చేయాలంటే బి.యస్.సి పట్టా ఉండేవారు తోడుగా వారి సమక్షంలోనే చేయాలని దానికి గాను 17 అంకణాల కంటే తక్కువగాని స్థలం గల ఇంటి లోపల సకల పరికరాలతో(వాటి అవసరం లేకున్నా) ఉత్పత్తి చేసి, వారు చెప్పినట్లు లేబిల్ డిజైన్‌లతో, కాల పరిమితి విధించి ఇలా వివిధ రకాలుగా విసిగించడం మొదలవడంతో(1999 నుండి) ఆ ఉద్దేశం ఉపసంహరించుకొన్నాను. మందుల షాపులపైన, చిరు వ్యాపారస్తులపైననే వీరి జులుం. పనిచేయని పనికిమాలిన మందులు తయారుచేసి నెలకు లక్షలు లంచాలిచ్చి, కోట్లు గడిస్తున్న కొన్ని బడా కంపెనీల జోలికి పొరబాటున కూడా 'పోరు'. పోతే 'పోరు' తప్పదని తెల్సుగనుక. ఆయుష్ అని వ్రాశాను పైన. **'A'**yurved, **'U'**nani, **'S'**idda, **'H'**omeo ఇవి మన దేశవాళీ వైద్య నామాలు; వీటిలోని తొలి అక్షరాలతో 'AUSH' ఆయుష్ అని పిలువబడ్తుంది అంతే. లక్షలు వెచ్చించి(శాంపిల్స్‌కై) వంద మంది రోగులపై పరీక్షలు నెరపి ఫలితం బావుందని(90%) నిజాం కాలేజి + హాస్పిటల్ సూపరింటెండెంట్ ఇచ్చిన సర్టిఫికేట్ కూడా వుంది నా వద్ద. **ఆయుష్‌ను 'ప్రోత్సహించాలని'** నేతలు పైకి చించుకుంటుంటారు గొంతును. ఔత్సాహికులైన నా బోటివారు ఎందరో వున్నారు. **వాళ్లను 'ప్రోత్స'హించి'స్తున్నారు** అంతే తేడా.

ఇక అసలు విషయానికొద్దాం :– ఏటా రాజధానిలో వినాయకచవితి పండుగలో విగ్రహాలు వేలు; వాటి లావణ్యానికి లక్షలు, వేలంలో కొనే లడ్లు కోట్లు. ఇదంతా దండా చందాలతోచేసే తంతు.(దాంతో పోల్చితే నెల్లూరులాంటి నగరాల్లో జరిగేది వెయ్యోవంతు.) అంతా వారం లోపు హుస్సేన్‌సాగర్‌లో గల్లంతు. ఇదా భక్తి?! ఈ తంతుకు నేతల వంత కూడా. చివర్న చిందులు, విందులు, తాగి తప్పెట్లు, తదనుగుణంగా నాయకుల చప్పట్లు(బహుశా వారికీ వాటా ఉంటుందేమో అంగళ్ల వారిచ్చే వసూళ్లలో) మనం ఇళ్లలో మన్ను ప్రతిమలను పెట్టి పైన వ్రాసిన 21 వృక్ష పక్షాల పత్రితో పూజిస్తే పుణ్యంగానీ అంతటి ఆర్భాటాలకు వినాయక స్వామి వారు వినోదించి విఘ్నాలను విచ్ఛిన్నం గావిస్తాడా ఆ సంఘ విద్రోహులకు. అడిగినంత ఇవ్వకపోతే అంగళ్ల అద్దాలు పగులగొట్టే పిరికి సన్నాసుల గుంపుగూర్చి మనకెందుకు గానీ... పెద్దలు ప్రతిమతోటి పత్రిని కూడా ఎక్కడ ఏ నీటిలోనైనా ఎందుకు పారవేయమన్నారు? ఆ పత్రిలో ఔషధ గుణాలు పరిమళాలున్నాయి. వాటి మూలాన నీటి కాలుష్యం నశించి దోమల్ని, కీటకాల్ని చంపేస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే 'నీరు పన్నీరవుతుంది'. కాలుష్య నివారణకై పబ్లిక్ ప్రాంతాల్లో పొగ తాగరాదని, ప్లాస్టిక్ కవర్లు కూడా వాడరాదని ప్రభుత్వాంక్షలు. కానీ రంగుల హంగులతో 50 మొదలు వందడుగులు పైగా ఎత్తుండే గణపతి 'విష విగ్రహాల్ని' క్రేన్లు పెట్టి పెద్ద మోటారు వాహనాల్లో తెచ్చేటందుకు ఊతమిస్తున్నారు నేతలు నీటకలిపేందుకు. నాయకులకు చుట్టూ ఎప్పుడూ, హోదాని బట్టి రక్షకులుంటారు తుపాకీలతోటి. ప్రజలెక్కడికైనా ఆయుధాలతో వెళ్తున్నారా? లేదే. అంటే జనం అజాత శతృవులు; అనగా మనలాంటి సాదు జనులైనట్టి మానవులను, దానవులు పరిపాలిస్తున్నారన్న మాట. ఇది దేశం మొత్తంలో అందరికీ వర్తించకపోయినా **'సింహ భాగం' అట్టి వారే** ఉన్నారు.

ఏమండీ (ఆ)గోవులెల్లుండి వినాయకచవితి పండుగ. పత్రితో అర్చించి, కుడుములు సమర్పించి(బొజ్జ గణయ్య కిష్టమైనవి ఉండ్రాళ్లు) వారంలోగా జలంలోవేసి రోజుకొక్క మారు 21 పత్రి నామాల్ని స్మరిస్తుండండి. మీకు శుభం కల్గుతుంది. నా మాట నమ్మండి, మీ మీద ఒట్టండి. సదా మీ...

డా॥ పెళ్లకూరు జె.పి.రెడ్డి M.B.B.S., F.S.I., F.I.C., U.S.A
చర్మ & సెక్స్ స్పెషలిస్ట్, నెల్లూరు. ఫోన్ : 0861-2333666



✍ అల్లూరు రహీం

సమైక్యాంధ్ర ఉద్యమ ఉధృతి మూలంగా గత నెల రోజులుగా పెద్ద హీరోల సినిమాలు విడుదల కావడం లేదు. ఈ గ్యాప్‌లో గతంలో రీళ్లు చుట్టేసి ల్యాబ్‌లలో పడేసి ఉన్న చిత్రాల బాక్సుల దుమ్ము దులిపి ప్రేక్షకుల మీదకు వదలి పెడుతున్నారు. ఈ కోవలో విడుదలైన సినిమానే ప్రేమ ఒక మైకం. ఈ చిత్రాన్ని గతంలో టెన్త్ క్లాస్, నోట్‌బుక్ వంటి చిన్న చిత్రాలను తీసిన దర్శకుడు చందు తీశాడు. ఈ సినిమాలో హీరోయిన్ చార్మి మొదటి అరగంట, చివరి పదిహేను నిమిషాలు మాత్రమే కనిపిస్తుంది. ఆ తర్వాత ఈ సినిమా కథకు మరో ప్రేమ ఉప కథను దర్శకుడు జోడించాడు. కానీ ఈ కథను తెరకెక్కించిన తీరు దూరదర్శన్‌లో ప్రసారమయ్యే సీరియల్స్ కన్నా ఘోరంగా వుంది. పేరు, ఊరులేని నటుల నటన చూడలేక ప్రేక్షకులు ఇబ్బంది పడిపోతారు.

తెలుగు సినిమాల్లో వేశ్య పాత్రపై హీరోయిన్లకు మోజు జాస్తి. ఈ మధ్య వేదంలో అనుష్క, పవిత్రలో శ్రియ వేశ్యలుగా కనిపించారు. ఆంగ్ల చిత్రం ప్రెట్టీ ఉమన్ స్ఫూర్తితో ప్రేమ ఒక మైకంలో తాను వేశ్య పాత్ర పోషణకు ఒప్పుకొన్నట్లు చార్మి చెప్పుకొచ్చింది. ఈ చిత్ర దర్శకుడు మినహా సినిమాకు పనిచేసిన సంగీత దర్శకుడు కెమెరామెన్, మాటల రచయిత అందరూ కొత్త వాళ్లే. వీళ్లంతా ఈ సినిమా కోసం కసితో పనిచేయాల్సింది పోయి తూతూ మంత్రంగా పని చేశారు. కెమెరామెన్ ప్రవీణ్ బంగారి చాలా సీన్లను చీకటి మయంగా చిత్రీకరిస్తే, చార్మి పబ్బులో నర్తించే పాటకు సైతం సంగీత దర్శకుడు ఎస్.ఆర్. పోశోం చక్కని సంగీతమందివ్వలేక పోయాడు. స్వచ్ఛమైన ప్రేమ పల్లవితో సాగే పాటలో సాహిత్యం బాగుంది. పలు సినిమా పత్రికల్లో పనిచేసిన పులగం చిన్నారాయణ వ్రాసిన మాటల్లో మగాళ్ల ఆడాళ్లను కళ్లతో స్కానింగ్ చేస్తారు. మనసు సైజు తగ్గుతుంది. లక్ష్యాన్ని వెతుక్కుంటూ వెళ్లాలి. ప్రపంచంలో గొప్పది డబ్బు ఆలోచింపజేస్తాయి. గూగూల్ బామ్మ, తాగుబోతు రమేష్, రామ్‌గోపాల్ వర్మ డూప్ పాత్రలు చేసే హాస్యం ఈ సినిమా చూస్తుండే ప్రేక్షకులకు పెద్ద రిలీఫ్‌నిస్తుంది. చిత్ర ప్రారంభం ముందు పెట్టిన ప్రేమ ఒక మైకం బ్యాలేనే సమర్థవంతంగా దర్శకుడు తీయలేక చతికిల బడ్డాడంటే ఈ సినిమా ఎలా ఉండబోతుందనేది కాస్త తెలివైన ప్రేక్షకులు ముందుగానే అర్థం చేసుకొంటారు. చచ్చు పుచ్చు కథలతో నిర్మాతలను దివాలా తీయించే చిత్రాలను చందులాంటి దర్శకులు మానాలని ప్రేమ ఒక మైకం చిత్ర ఫలితం చెప్పిందనక తప్పదు.

చిత్ర సమీక్ష

చిత్ర కథలోనికి వెళ్తే మల్లిక(చార్మి) ఓ కాల్‌గర్ల్. సమాజంలోని పెద్ద ప్రముఖులు ఆమె పొందుకోసం తహతహలాడుతుంటారు. డబ్బుతోపాటు మద్యం, మత్తు, శారీరక సుఖమే జీవన మనుకొంటుంది మల్లిక. ఒక రోజు తాగి కారు నడుపుతూ లలిత్(రాహుల్)ను కొట్టేస్తుంది. అతని కళ్లు పోతాయి. లలిత్ కవి. అతడ్ని ఆస్పత్రి నుంచి తన ఇంటికి తీసుకెళ్తుంది. లలిత్ చెప్పే భావ స్ఫోరక మాటలు, కవిత్వంతో మల్లిక మనసు మారుతుంది. ఇక్కడ నుంచి కథ బ్యాక్‌డ్రాప్‌లోనికి వెళ్తుంది. లలిత్ ఓ కుగ్రామంలో ఉంటాడు. అతడు త్రాసే కవిత్వాన్ని స్వాతి పత్రికకు పంపగా అది హైదరాబాద్‌లో వర్ధమాన గాయని స్వాతి(శరణ్యనాగ్) చెంత చేరుతుంది. ఆ ఒకే ఒక్క కవిత స్వాతిని గొప్ప సినీ గాయని చేస్తుంది. ఆమె తనకు కవితలు వ్రాసి పంపే లలిత్‌కే తన జీవితం అంకితమంటోంది. మధ్యలో లలిత్ స్నేహితుని ప్రాణం కాపాడను తన ప్రేమను ఐదు లక్షలకు స్వాతిని పెళ్లి చేసుకోవాలనుకొనే శ్రీనుకు అమ్మేస్తాడు. లలిత్ డైరీ చదివే మల్లిక వేశ్యగా తన బతుకు వ్యర్థమని, లలిత్ స్వాతిల ప్రేమను ఫలింపజేయను తాను ప్రాణం తీసుకొంటుంది. మల్లిక కళ్లు లలిత్‌కు అమర్చడం, స్వాతి అతన్ని హత్తు కోవడంతో సినిమా ముగుస్తుంది.

చార్మి తన పాత్రను బాగానే చేసింది. మిగతా అంశాలన్నీ విఫలమవ్వడంతో ప్రేక్షకులకు నరకం ప్రేమ ఒక మైకం.



కత్రినాకైఫ్, ప్రియాంకా చోప్రా, దీపికా పదుకొణే... ఇలా బాలీవుడ్‌లో పోటాపోటీ అందాలున్నాయి. అయినా కూడా పెళ్లి చేసుకున్న ముద్దుగుమ్మ విద్యాబాలన్‌కే ఎక్కువమంది ఓటేశారు. అందమంటే ఆమెదే అంటూ యువతరం ఆరాధిస్తున్నారు. ఇటీవల ఓ ప్రైవేటు సంస్థ బాలీవుడ్‌లో అందగత్తెలు ఎవరనే విషయంపై సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో ఎక్కువమంది విద్యకే ఓటేశారట. డర్టీ పిక్చర్ చిత్రం చేశాక... అమ్మడికి క్రేజ్ విపరీతంగా పెరిగిందట. ఎంతమంది ఎన్ని రకాలుగా తమ అందాలు ప్రదర్శించినా విద్యాబాలన్‌ని మాత్రం అధిగమించలేరని యువతరం తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. ఇదే విషయాన్ని విద్యాబాలన్ దగ్గర ప్రస్తావిస్తే... అందంగా ఉన్నారంటే అమ్మాయిలు పొంగి పోతారు. నేనూ అంతే. అయితే నేనే అందంగా ఉన్నానని మాత్రం నేను చెప్పలేను. హిందీ చిత్రసీమలో ఎంతో మంది అందగత్తెలు ఉన్నారని చెప్పుకొచ్చింది.



విడాకులబాటలో మమత!

యమదొంగ, కృష్ణార్జున, కేడి చిత్రాల్లో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న మమతా మోహన్‌దాస్ ఆకలేస్తే అన్నం పెడతా వంటి సూపర్ హిట్ పాటలు పాడిన గాయని కూడా. బాల్య స్నేహితుడు, ప్రముఖ వ్యాపారవేత్త ప్రజీవ్ పద్మనాభన్‌ను వివాహమాడి తెరకు దూరమైంది. అయితే వీరి బంధం ఎన్నాళ్లో సాగలేదు. ఇద్దరి మధ్య తీవ్ర మనస్పర్థలు చోటుచేసుకోవడంతో వేరు పడ్డారు. విడాకులు కావాలంటూ కోర్టుకెక్కారు. ఇటీవలే కోర్టు వీరిద్దరికి విడాకులు మంజూరు చేసింది. వివాహ బంధాన్ని తెంచుకొన్న మమతా మోహన్‌దాస్ నటిగా మళ్లీ తెరపై సందడి చేసేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తు తం ఒకట్రెండు మళయాళ చిత్రాల్లో నటిస్తోంది.




ఒంటరి జీవితం బాగుంది!


ప్రభుదేవాతో వ్యవహారం బెడిసికొట్టాక... నయనతార తమిళ హీరో ఆర్యతో పీకల్లోతు ప్రేమాయణంలో మునిగి పోయిందనీ, త్వరలో అతన్ని పెళ్లి చేసుకోబోతున్నట్లు ప్రచారం సాగుతుంది. ఆర్య ఆమెను తన ఇంటికి తీసుకెళ్లి కుటుంబసభ్యులతో పరిచయం చేశాడంటున్నారు. అయితే నయనతార ఇదంతా వట్టి పుకారే అని కొట్టి పారేసింది. ఆర్య నాకు మంచి స్నేహితుడు. ఒక పురుషుడు, స్త్రీ మధ్య స్నేహం ఉండకూడదా? ఇద్దరు కాస్త చనువుగా ఉంటే వారి మధ్య ప్రేమ ఉన్నట్లే లెక్కా అంటోంది. ఒంటరి జీవితం బాగుందని, సినిమా తప్ప మరో విషయం గూర్చి ప్రస్తుతం ఆలోచన లేదంటుంది.

శ్రుతిహాసన్ దూకుడు!



హిందీ సినీ పరిశ్రమలో దూకుడు కొనసాగిస్తుంది శ్రుతిహాసన్. అగ్ర హీరోయిన్లను కాదని అవకాశాల్ని అంది పుచ్చుకొంది. ఇటీవల ఆసిన్ చేతికి దక్కాల్సిన ఓ సినిమాను తన బుట్టలే వేసుకొందీ అమ్మడు. వెల్‌కమ్ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కుతున్న వెల్‌కమ్ బ్యాక్‌లో జాన్ అబ్రహామ్ సరసన నటించే అవకాశాన్ని సొంతం చేసుకొంది. శ్రుతిహాసన్ ఇటీవల రామయ్య వస్తావయ్య, డిడే చిత్రాలతో హిందీ ప్రేక్షకుల్ని ఆకట్టుకొంది. వాటిలో శ్రుతి కనిపించిన విధానం హిందీ ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకొంది. వరుస అవకాశాలు దక్కుతుండటానికి కారణం ఆ చిత్రాలే అని చెబుతున్నాయి హిందీ వర్గాలు.





ఉచిత నటన!

జగద్గురు ఆదిశంకర చిత్రంలో అగ్ర హీరోలు నాగార్జున, మోహన్‌బాబు, సుమన్, శ్రీహరి, సాయికుమార్ చాలా కీలక పాత్రల్లో కనిపిస్తారు. ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ సినిమాలో నటించను వాళ్లు పైసా కూడా పారితోషికం తీసుకోలేదు. ఓ మంచి సినిమాలో పాలుపంచుకోవాలనే సదుద్దేశంతో ఈ సినిమాను అంగీకరించారట. విలువలతో కూడిన సినిమాలు తీయడానికి నిర్మాతలు సిద్ధమైతే తాము కూడా అందులో పాలు పంచుకొంటామని వీళ్లంతా చాటి చెప్పారు. పరిశ్రమలో ఇది మంచి పరిణామమంటున్నారు.

మాతృభాషను మరవకూడదు!

తెలుగు భాషా దినోత్సవంలో జాయింట్ కలెక్టర్



మాట్లాడుతున్న జెసి లక్ష్మీకాంతం.

తెలుగు భాష మృదు మధురమైనదని, దీన్ని పొరపాటున కూడా మరువకూడదని, భాష యొక్క గొప్పతనాన్ని ఆస్వాదించాలని జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం చెప్పారు. తెలుగు భాషోద్యమ సమితి నేతృత్వంలో నెల్లూరులోని ఆదిత్య డిగ్రీ కాలేజిలో జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో జెసి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. మన స్సులోని భావోద్రేకాలను వ్యక్తపరిచేందుకు తెలుగు భాష సరైంది. దేశ భాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణ దేవరాయలు ఊరకే చెప్పలే దని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. సభాధ్య క్షుడు ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ తెలుగు భాష అనంత భాషయని, సంగీతానికి గొప్పగా సరిపోతుందన్నారు. సభలో తెలుగు భాష గొప్ప తనాన్ని నేలనూతల ప్రశాంతి, కోడూరు శ్రీనివా సులు నాయుడు కూడా వివరించారు. బిఎస్ఆర్ ఆంజనేయులు, మూలనాగిరెడ్డి, బొగ్గవరపు రాధాకృష్ణమూర్తి, శానంపూడి కృష్ణయ్య, నాగ రాజు, గుండ్రా శ్రీనివాసులురెడ్డి తదితరులు ఈ సభలో పాల్గొన్నారు. సీతారామస్వామి జనగణ మన జాతీయ గీతాలాపనతో సభ ముగిసింది.

● ఆరోగ్యశ్రీ సేవల్లో

నారాయణ హాస్పిటల్ రికార్డు!

నారాయణ ప్రాంతీయ వైద్యశాల నుంచి వైద్య సమాచార మాస పత్రికను తేవడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ పేర్కొ న్నారు. నారాయణ వైద్యశాల నేతృత్వంలో రూపుదిద్దుకొన్న వైద్య నారా యణం పత్రికను కలెక్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. నేను థాయ్‌లాండ్ వెళ్లినప్పుడు ఒక విభాగంలోనే 20 పత్రికలు ప్రచురించడం గమనించా నన్నారు. దీని వలన ఆయా విభాగాల గూర్చి మంచి అవగాహన కలు గుతుందన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో చిన్న చిన్న సమస్యలను పరిష్కరించక పోవడం వల్ల ఆ భారం నారాయణ వంటి



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకాంత్.

ప్రాంతీయ వైద్యశాలల మీద పడుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాల నుంచి రోగులు వచ్చినప్పుడు నారాయణలో వారికి ఇబ్బం దులు లేకుండా చూడాలన్నారు. రాష్ట్రంలోనే ఎక్కువగా ఆరోగ్యశ్రీ సేవలు నారాయణ వైద్యశాల నుంచి పొందడం అభినందనీయమన్నారు. నగ రం నుంచి నారాయణ హాస్పిటల్‌కు బస్సు సదుపాయం కల్పించను తగిన చర్యలు తీసుకొంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. నారాయణ వైద్య సం స్థల డైరక్టర్ డాక్టర్ జి.సుబ్రహ్మణ్యం, వైద్యశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీర నాగిరెడ్డి, కో ఆర్డినేటర్ డాక్టర్ సర్వేపల్లి విజయ్‌కుమార్, నారాయణ విద్యా సంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, సిఇఓ వేమిరెడ్డి పట్టాభిరామి రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొందరు సమ్మెలో... మరి కొందరు విధుల్లో!

రాష్ట్ర విభజనకు వ్యతిరేకంగా కొందరు ఉద్యోగులు సమ్మెలో వుం డగా, మరికొందరు విధులు నిర్వహిస్తున్నారు. విధులు నిర్వహిస్తున్న వారికి కూడా ఆగష్టు నెల జీతాలు మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ఉదాహరణగా స్త్రీ, శిశు సంక్షేమ శాఖను పేర్కొనవచ్చు. సకల జనుల సమ్మెలో భాగంగా అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు విధులను బహిష్కరించి సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు సైతం సమ్మెలో కొనసాగుతున్నారు. కేవలం అంగన్‌వాడీ వర్కర్లు, కాంట్రాక్టు ప్రాతిపదికన నియమితులైన సూపర్‌వైజర్లు మాత్రం విధులు నిర్వహిస్తున్నారు. సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ వర్కర్ల పనితీరును పర్యవేక్షించే సిడిపిఓలు కార్యాలయ సిబ్బంది సమ్మెలో వుండడంతో వేత నాలు మంజూరుచేసే వారు లేకుండా పోయారు. అంగన్‌వాడీ కేంద్రా లను నిర్వహిస్తూ పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేసి నెల వారి నివేదికను సిడిపిఓలకు అందించాలి. కార్యాలయం మూతపడ డంతో నివేదికలు స్వీకరించే పరిస్థితి లేదు. సూపర్‌వైజర్లు సైతం ఇళ్లకు పరిమితమై పోయారు. సమ్మెలో లేకుండా విధులు నిర్వహిస్తున్న వారికి అసలు జీతాలు అందుతాయా లేదా అనేది సందేహంగా వుంది.

సమైక్యాంధ్ర కోసం అజ్మీర్ దర్గాలో ప్రార్థనలు!

నెల్లూరు జెండావీధి ముస్లిం యూత్ సమైక్యాంధ్ర కొనసాగా లంటూ రాజస్థాన్‌లోని అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసింది. రాష్ట్రాన్ని ముక్కలు చేస్తే తెలుగు తల్లిని ముక్కలు చేసినట్లేనని ఆ పాపం సోనియాగాంధీ చేయకుండా ఆమె మనసు మారేలా అజ్మీర్ బాబా చూడాలని దువా చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మీరామొహియుద్దీన్, షేక్ ఖలీద్, రబ్బు, రబ్బానీ, అల్తాఫ్, నజర్ తదితరులు పాల్గొన్నారు.

జెండావీధి యువకుల సుదూర ప్రయాణం

● డాక్టర్ కిషోర్స్ రత్నం కిడ్స్‌లో

శ్రీకృష్ణ జన్మాష్టమి!



శ్రీకృష్ణునితో గోపికలు.

నెల్లూరు సరస్వతినగర్‌లోని డాక్టర్ కిషోర్స్ రత్నం కిడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మా ష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్లే క్లాసు, ఎల్‌కెజి, యుకెజి చిన్నారులు చిన్ని కృష్ణుడు, గోపి కల సాంప్రదాయ దుస్తులు ధరించి ముద్దులొ లికే రీతిలో ముస్తాబయ్యి వచ్చి బుడి బుడి నడక లతో చేసిన నృత్యాలు ఆకట్టుకొన్నాయి. ఈ కార్య క్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, మేనేజర్ రాజేష్, రేస్ ప్రిన్సిపాల్ రేవతి, కిడ్స్ ప్రిన్సిపాల్ లక్ష్మి అధ్యాపక బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

రూపుదిద్దుకొంటున్న గణపతి విగ్రహాలు!

బిజీగా తయారీదారులు



విగ్రహ తయారీలో కార్మికుడు.

వినాయకచవితి పండుగ వస్తుండడంతో నగరంలోగల గణనా ధుని విగ్రహాలు ఆకర్షణీయంగా రూపుదిద్దుకొంటున్నాయి. ఈ విగ్ర హాల తయారీలో పేరుగాంచిన ఉత్తర ప్రదేశ్‌కు చెందినవారు ఈ పనిలో బిజీగా నిమగ్నమై వున్నారు. భిన్న ఆకృతులలో విఘ్నేశ్వరుని ప్రతిమలు తయారు చేసేందుకు తమ కళానైపు ణ్యాన్ని ప్రదర్శిస్తుండడంతో పలు రకా లుగా విఘ్నేశ్వరుడు దర్శనమిస్తున్నాడు. గతంలో ఈ విగ్రహాల తయారీదారులు పెద్దాస్పత్రి వద్ద ఫుట్‌పాత్‌పై నివాసాలు ఏర్పాటు చేసుకొని గణపతి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేస్తుండేవారు. రోడ్డు వెడల్పు చేస్తూ వీరిని అక్కడ నుంచి తొలగించడంతో మినీ బైపాస్‌లో ఈ విగ్రహాలను తయారు చేస్తున్నారు. గత ఏడాది విగ్రహాల తయారీదారులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సీజన్‌లో వర్షాలు పడడం, అధికంగా విగ్రహాలు అమ్ముడు పోతా యని భారీ విగ్రహాలను అధికంగా ఖర్చు చేసి తయారు చేయడంతో విగ్రహాలు అనుకొన్న విధంగా అమ్ముడుపోక వర్షాలు పడి తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది ఆ నష్టాలను పూడ్చు కొనేందుకు కొంతైనా కష్టానికి తగ్గ ఫలితం పొందేందుకు విగ్రహాల రూపకర్తలు జాగ్రత్త పడు తున్నారు. నగరంలోని వివిధ కూడళ్లలో బొమ్మలను పెట్టేవారు చందాలు దండకాల్లో మునిగి పోయి వున్నారు. కొన్ని చోట్ల బలవంతపు వసూళ్లు జరుగుతున్నట్లు సమాచారం. పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేసినా బలవంతంగా బెదిరించి చందాలు వసూళ్లు జరిగిపోతూనే వున్నాయి. సెప్టెంబర్ 9న వినాయకచవితి కావడంతో అంగరంగ వైభవంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు నిర్వాహకులు. పర్యావరణానికి నష్టం కలుగకుండా వుం డేందుకు మట్టితో చేసిన బొమ్మలను వినియోగించాలని ప్రజలు ఈ విషయంలో శ్రద్ధ పెట్టా లని, అవగాహన కల్గి వుండాలని జనవిజ్ఞాన వేదికలాంటివి ప్రచారం చేస్తున్నాయి.

జీతాలకోసం ఆర్టీసి కార్మికుల ఎదురుచూపు!

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జిల్లాలో పది డిపోల పరిధిలో పనిచేస్తున్న కార్మికులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. సమైక్యాంధ్ర ఉద్యమానికి మద్దతుగా ప్రభుత్వ శాఖల ఉద్యోగుల తోపాటు ఆర్టీసి కార్మిక సంఘాలు కూడా సమ్మెలో వున్నాయి. సమ్మె కాలానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జీతాలు చెల్లించే అవకాశం లేదు. విధుల్లో వున్న సిబ్బం దికి వేతనాలు చెల్లించాలన్న ఖజానా శాఖ ఉద్యోగులు సమ్మెలో వున్నారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు ఆగష్టు నెల వేతనాలపై ఆశలు వదులుకు న్నారు. కానీ ఆర్టీసి కార్మికులకు ఖజానా కార్యాలయంతో సంబంధం లేకుండా నేరుగా వేతనాలు చెల్లిస్తారు. గత నెల రోజుల నుంచి ఆర్టీసి కార్మికులు సమ్మెలో వుండడంతో కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ మాత్రం సమ్మెకు దూరంగా వుంది. ఈ యూనియన్‌కు చెందిన వారి ద్వారా కొన్ని రూట్లలో బస్సులు తిరుగుతున్నాయి. ఆర్టీసి డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్లతోపాటు గ్యారేజీల్లో మెకానిక్‌లు, హెల్పర్లు పని చేస్తున్నారు. వీరిలో ఎక్కువ భాగం నెలసరి వేతనంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సమ్మెలో లేకున్నప్పటికీ జీతాలు చెల్లించడం కుదరదని అధికారులు తేల్చి చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో వున్నారు.

పనిచేసినా ఇవ్వమంటే ఎలా?

ఆరోపణలున్న ఉద్యోగికి ప్రశంసాపత్రం!

అవినీతి నిరోధక శాఖ నుండి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ ఉద్యోగికి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం స్వీకరించేందుకు అధికారులు సహకరించడం వివాదా స్పదంగా మారింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచే స్తున్న వ్యక్తి పదవీ విరమణ చేసిన డాక్టర్ మాశిలామణి హయాంలో పలు అవినీతి, అక్రమా లకు పాల్పడ్డారన్న ఆరోపణలున్నాయి. వీటిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు డిఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంపై దాడులుచేసిన సమయంలో మాశిలామణితోపాటు ఎఓ, మరో ఇద్దరు గుమస్తాలు సిబ్బంది బదలీలు, పదోన్నతులు విషయంలో అక్రమాలకు పాల్పడ్డారంటూ గుర్తిం చారు. వారిపై చర్యలు తీసుకొనేందుకు ప్రభుత్వానికి ఎసిబి నివేదిక పంపింది. ఈ విషయం ఆ శాఖ ఉన్నతాధికారులకు తెలిసినా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అందించే అవార్డు పొందేందుకు సీనియర్ అసిస్టెంట్‌ను ఎలా ఎంపిక చేశారన్నది ప్రశ్న. శాఖాపరంగా ప్రజలకు సేవలు అందించిన వారిని గుర్తించి వారిని మరింత ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం రిప బ్లిక్‌డే, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ అవార్డులు ఇస్తుంటారు.

జఠిలంగా రాష్ట్ర విభజన

మొదటి పేజీ కొరవ

రికి అదే చెప్తున్నాడు. ఏదో ఒక సాంకేతిక కారణంతో ప్రస్తుతానికి ఈ నిర్ణయాన్ని వెనక్కు నెడుతానని చాలా నమ్మకంతో అందరికీ సలహాలిస్తున్నాడు. అసెంబ్లీ తీర్మానం పెడితే, దాన్ని ఓడించాలన్నది ఆయన ఉద్దేశం. అదే జరిగితే, రేపు లోక్‌సభలో బిల్లు పెట్టినప్పుడు, మీ స్వంత పార్టీ, ప్రభుత్వం తిరస్కరించిన బిల్లును మీరే ఎట్లా ముందుకు తెస్తారని లోక్‌సభలో ప్రశ్నిస్తారు. కాంగ్రెస్ నాయకత్వం ఇబ్బందిలో పడుతుంది. ఆ రూపంలో కొంత సమయం వస్తుంది అన్నది ముఖ్యమంత్రి చేస్తున్న వాదన.

హైదరాబాద్ గతేమిటి?

హైదరాబాద్ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చబోతున్నారని జాతీయ టీవీ ఛానళ్లలో వార్త వచ్చింది. వాటి తీరు చూస్తే కేంద్ర హోం మంత్రిత్వ శాఖలో ఎవరో కావాలనే లేఖ ఇచ్చినట్లు అర్థమైపోతున్నది. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయడం అంటే ఏమిటి? ఎట్లా? ఎందుకు? దానివల్ల ఉపయోగం ఏమిటి? ఎవరికి? యుటి అంటే, చండీఘడ్ వలె పూర్తిగానా లేక ఢిల్లీ వలె సగం మాత్రమేనా? చండీఘడ్ నగరం మొత్తాన్ని కేంద్రం పాలిస్తుంది. కానీ ఢిల్లీలో శాసనసభ, రాష్ట్ర ప్రభుత్వం, పరిమిత స్థాయిలో దానికి అధికారాలు వున్నాయి. కానీ పట్టణ అభివృద్ధి, శాంతి భద్రతలు వంటి వాటికి లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా కేంద్రం నియమిస్తుంది. ఈ రెండు పద్ధతులలో హైదరాబాద్‌కు దేన్ని వర్తింప చేస్తారు? హైదరాబాదు తెలంగాణకు నడి బొడ్డున వుంది. ఆంధ్ర ప్రాంతం నుంచి అక్కడకు వెళ్లాలంటే ఏదో ఒక తెలంగాణ జిల్లాను దాటుకొని వెళ్లాలి. అటువంటప్పుడు రెండు రాష్ట్రాల రాజధానులు అక్కడ కొనసాగించడం ఎట్లా సాధ్యం? హైదరాబాద్ నుంచి వస్తువులతో బయలుదేరిన వాహనం ఏ రాష్ట్రంలో పన్ను చెల్లించాలి? ఏ చెక్ పోస్టులో పరిశీలన జరపాలి? హైదరాబాద్ కేంద్ర పరిధిలో వుండి, రెండు రాష్ట్రాలు రాజధానులు నడుపుకొంటే అయోమయం తప్ప పాలన సక్రమంగా జరగదు. ప్రతి రోజూ వివాదాలు తప్పవు.

రెండు రాజధానులైతే?

అట్లాకాక, హైదరాబాద్ నుంచి రెండు రాజధానులనూ తరలిస్తే ఏమౌతుంది? అందుకు మనం ఒప్పుకొన్నా తెలంగాణ వాదులు ఒప్పుకోరు. హైదరాబాదులోని ప్రతి ప్రభుత్వ భవనమూ ఆంధ్ర కలవక ముందే, తెలంగాణవాసుల నుంచి దండిన పన్నుల సొత్తుతో నిజాం నవాబు నిర్మించాడు. మా సొమ్ముతో కట్టుకొన్న భవనాలు వదలి మేమెందుకు కొత్తగా ఏర్పాట్లు చేసుకోవాలి అని సహజంగానే అడుగుతారు తెలంగాణ వాదులు. అది న్యాయమైన ప్రశ్న.

ఏది ఏమైనా రాష్ట్ర విభజన వివాదం రోజు రోజుకూ జటిలంగా మారుతున్నది. దీన్ని పరిష్కరించే రాజనీతిజ్ఞత కల్గిన నేతలు రాష్ట్రంలో లేరు. కేంద్రంలోనూ లేరు. రేపేమౌతుందో ఏమాత్రం వూహ కూడా చేయలేని పరిస్థితి. దీనివల్ల రాష్ట్రానికి జరిగే నష్టం అంతా ఇంతా కాదు.



నెల్లూరులో జరిగిన సమైక్యాంధ్ర సింహ గర్జన సదస్సులో సమైక్య నాదం విన్పిస్తున్న యువతులు.

నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

తెలుగుదేశం పార్టీ ఆరవ ముద్దాయని చమత్కరించారు. ఒకటి నుండి మూడవ ముద్దాయి వరకు కాంగ్రెస్ పార్టీనని, నాలుగైదు ముద్దాయిలు తెరాస, వైకాపాలని చెప్పుకొచ్చి న్యాయవాదులను సంతృప్తి పరచారాయన.

డ్యాన్సుల్లో మేటి!

సమైక్యాంధ్ర ఉద్యమంలో పాల్గొనే నేతలు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు రకరకాల వేషాలు, విచిత్రమైన డ్యాన్సులు చేస్తూ జనాన్ని ఆకర్షిస్తున్నారు. నెల్లూరులోనూ ఈ డ్యాన్సుల హంగామా కొనసాగుతుంది. 4వ తేది వరకు నెల్లూరులో జరిగిన ప్రదర్శనలో ఈ డ్యాన్సుల్లో మొదటి బహుమతి ఇవ్వాల్సి వస్తే ఐటిడిఏ పిఓ వెంకటేశ్వర్లుదేనని చెప్పాలి. రెండో బహుమతిని ఎస్‌సి కార్పొరేషన్ ఇడి సోమయ్య, మూడవ బహుమతి వేషగాళ్లకు వేషగాడు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానంద రెడ్డికి ఇవ్వక తప్పదని వీరి డ్యాన్సులు బాగా పరిశీలించిన ఎలక్ట్రానిక్ ఛానల్ కెమెరామన్ ఒకరు తేల్చి చెప్పారు.

సండే మార్కెట్ వ్యాపారుల వివరణ!

ఆగష్టు 31వ తేది జమీన్‌రైతులో 'సండే మార్కెట్‌లో కిషోర్‌బాబు జులుం' శీర్షిక పేరిట ప్రచురితమైన వార్తకు నెల్లూరు పట్టణ రోడ్ మార్జిన్ వ్యాపారుల సంక్షేమ సంఘం వివరణ పంపింది. సండే మార్కెట్‌లో ఎవరైనా అనారోగ్యానికి గురికావడం, ఆర్థికంగా షాపు నడుపుకోలేని స్థితికి గురవ్వడం లేదా వేరే వ్యాపారం చేసుకోడానికి పూనుకోకపోవడం అన్న పరిస్థితుల్లోనే షాపులు అమ్ముకొంటున్నారు. కమిటీ జోక్యం కేవలం వచ్చే కొత్త సభ్యుడు మార్కెట్ నియమనిబంధనలను, క్రమశిక్షణను పాటిస్తాడా అనేది పరిశీలిస్తుందన్నారు. శేషమ్మ బంకు అమ్ముకునే విషయంలో ఒక న్యాయవాది జోక్యంతో వివాదంచేసి కిషోర్‌బాబును గబ్బు పట్టించను ప్రయత్నించాడని వివరించారు. ఈ ప్రకటనపై సంతకం చేసిన వారిలో సంక్షేమ సంఘం అధ్యక్షుడు టి.రమేష్, కార్యదర్శి సి.నాగవడివేల్, కోశాధికారి షేక్.ఇలియాజ్ ఉన్నారు.

రామ్‌చరణ్ పోస్టర్లు కాల్చారు

కేంద్ర మంత్రి పదవికి చిరంజీవి రాజీనామా చేయాలని కోరుతూ సమైక్యాంధ్ర విద్యార్థి ఐకాస ఆయన కుమారుడు రామ్‌చరణ్ తేజ నటించిన తుఫాన్ చిత్ర పోస్టర్లు 2వ తేది నెల్లూరులో దహనం చేసింది. చిరంజీవి తీరుమారకుంటే తుఫాన్ చిత్రం విడుదలను నెల్లూరులో అడ్డుకొంటామని విద్యార్థి ఐకాస ప్రతిజ్ఞ చేసింది.

ఉచిత ఎస్ఎంఎస్‌లను రద్దుచేసిన బిఎస్ఎన్ఎల్!

సెల్‌ఫోన్ వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తామని చెప్పే బిఎస్ఎన్ఎల్ ఉచిత ఎస్ఎంఎస్‌లకు మంగళం పాడింది. బిఎస్ఎన్ఎల్ సెల్ వినియోగదారులకు ప్రతినెలా 100 ఎస్ఎంఎస్‌లు ఉచితం. ఏ ఇతర నెట్‌వర్కుల కైనా ఇది పంపుకోవచ్చు. ఇది బాగా ఉపయోగకరంగా వుండింది. వున్నట్లుండి సెప్టెంబర్ 1 నుంచి ఉచిత ఎస్ఎంఎస్‌లను రద్దు చేశారు. ఆనాటి నుంచి ప్రతి సంక్షిప్త సందేశానికి 50 పైసలు చార్జ్ చేస్తున్నారు. గతంలో బిఎస్ఎన్ఎల్ నెలకు 200 ఉచిత ఎస్ఎంఎస్‌లు సౌకర్యం కల్పించి వుండేది. ఆ తర్వాత దీన్ని 100కు కుదించారు. ఇప్పుడు ఏకంగా రద్దు చేసిపారేశారు. అదేమంటే స్పెషల్ టారిఫ్ ఓచర్ వినియోగించా మంటున్నారు. బిఎస్ఎన్ఎల్ సేవలకు అర్థం ఇదా?

ఆర్టీసికి 60లక్షల నష్టం

సమైక్యాంధ్ర ఉద్యమం కారణంగా ఆర్టీసి బస్సులు నడవడంలేదు. మొత్తం పది డిపోల్లో బస్సులు మూడు వారాలుగా నడవకపోవడంతో ఇప్పటివరకు 60 లక్షల రూపాయలకు పైగా నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఉద్యమం ఇలాగే కొనసాగితే ఆర్టీసి తీవ్ర నష్టాల్లో కూరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డికెడబ్ల్యు స్వర్ణోత్సవాలు

డికెడబ్ల్యు కళాశాల స్థాపించి యాభై ఏళ్ల అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం ఈ ప్రారంభ వేడుకలకు హాజరై దొడ్ల కౌసల్యమ్మ దాతృత్వాన్ని, దూర దృష్టిని కొనియాడారు. యువతులు చదువుకోవాలన్న ఉద్దేశంతో ఈ కాలేజీని స్థాపించారన్నారు.

నెల్లూరు జిల్లాను ఎండబెట్టి

9వ పేజీ కొరవ

చేయడానికి జరుగుతున్న ఈ ప్రయత్నాన్ని అడ్డుకోవడం జిల్లా ఎమ్మెల్యేల ధర్మం. జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ఇవన్నీ పట్టడంలేదు. ఆయన ధ్యాస అంతా దీపం వుండగానే ఇల్లు చక్కదిద్దుకోవడం మీద వుంది. ముఖ్యమంత్రి ప్రాపకంతో అడ్డమైన ఫైళ్ల మీద సంతకాలు పెట్టించుకొని, అడ్డంగా దోచుకోవడం మీదనే వుంది. రైతుల క్షేమం పట్టడం లేదు. జిల్లా ప్రయోజనాలు లెక్క చేయడం లేదు. కండ్లేరు నుంచి చిత్తూరు జిల్లాకు 10టిఎంసిల నీటి తరలింపుకు పైప్ లైన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంలోనే మంత్రిగారి బుద్ధి ఎంత వక్రంగా నడుస్తున్నదో అర్థమై పోయింది.

దురదృష్టవశాత్తు మన జిల్లాలో రాజకీయ వాదులందరూ అదే ధోరణిలో వున్నారు. చేతకాని దద్దమ్మలుగా, స్వార్థం తప్ప ప్రజల బాగు పట్టని నీచులుగా తయారయ్యారు. ఒక్క సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాత్రమే అడపా దడపా కొంత నోరు చేసుకొంటున్నాడు తప్ప, కమ్యూనిస్టులు కానీ, కాంగ్రెస్‌లోని తతిమా ఎమ్మెల్యేలు కానీ జిల్లాకు జరిగే అన్యాయాలను కనీసం ప్రశ్నించే శ్రమ కూడా తీసుకోవడం లేదు. రైతుల సంగతి చెప్పనవసరం లేదు. తమకు అన్యాయం జరుగుతున్నదని దిగేడవడం తప్ప, చొరవ చూపి గొడవకు దిగే తత్వం రైతాంగంలో ఎప్పుడూ వుండదు.

సోమశిల నీటి విషయంలో జిల్లా రైతుల ప్రయోజనాలు కాపాడడానికి గట్టి ప్రయత్నం జరపక పోతే, గట్టిగా ప్రతిఘటించకపోతే చాలా నష్టం జరుగుతుంది. అప్పుడు ఎంత ఏడ్చీ ప్రయోజనం లేదు.

జనవాణి

2వ పేజీ కొరవ

వరణానికి విఘాతం కలిగించకుండా థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలి.

సి.శ్యామసుందర్ నెల్లూరు

అమరజీవిని అన్యాయంగా చంపేశారు!

రకరకాల ఉద్యమాల పేరుతో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వ్యక్తులను నాలుగైదు రోజుల తర్వాత పోలీసులు బలవంతంగా ఆస్పత్రికి తరలించి సెలైన్లు ఎక్కిస్తున్నారు. ఇదే పద్ధతిని ఆనాడు ఆంధ్రప్రదేశ్ అవతరణ కోసం దీక్ష చేసిన పొట్టి శ్రీరాములు గారి పట్ల అనుసరించి వుంటే దేశానికి ఓ నిస్వార్థ నాయకుడు వుండేవాడు. ఆయన సేవలు ప్రజలకు ఉపయోగపడేవి.

టి.కోటేశ్వరరావు కోవూరు


సంపాదకుడు అభినందనీయుడు!

సమైక్యాంధ్ర ఉద్యమం జరుగుతున్న తీరు తెన్నులు, రాష్ట్ర విభజన అవసరాన్ని నొక్కి చెబుతూ 'జమీన్‌రైతు'లో గత నాలుగు వారాలుగా వచ్చిన వార్తలు మళ్లీ మళ్లీ చదవాలనిపించాయి. హైదరాబాద్‌లో జరిగిన ఒక సభలో సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి ఇదే విషయాన్ని ప్రస్తావించారు. ధైర్యంగా రాష్ట్ర విభజన సరైనదని రాష్ట్రంలో వ్రాసిన ఏకైక సంపాదకుడు నెల్లూరు డోలేంద్ర ప్రసాద్‌నే. ఆయనకు నా అభినందనలు.

కాకుటూరు సుబ్రహ్మణ్యం కావలి

పదరంగం -83

నిర్వహణ : బాబాజీ



అడ్డం

1. అడ్వాన్స్, సంచికరు (3)
3. బుట్ట (2)
5. స్మెల్, గంధ (3)
7. తలతెగిన కలిమి (2)
8. వెండి (3)
9. ఇంగ్లీషు కనిష్టం (3)
11. ట్రైబల్స్, కొండ ప్రజలు (5)
14. తరుణ వయస్కురాలు (3)
16. అమాయకురాలు... తుంగబుర్ర (4)
18. రాణిగారి భర్త (4)
20. పెనం మీద వేయించిన గింజలు (3)
21. వాక్కు మాట బ్రహ్మదేవుని భార్య (2)
23. ధరణి, నింగి క్రింద ఉండేది (2)
24. శత్రువు (4)
27. గతించిన కాలం (3)
28. ఆడ కాదు (2)
29. కంటిలోని బేబి (4)
31. అటునుంచి పడిపోవడం ఉద్దానం కాదు (3)
33. లోపల (2)
34. పోయిన సంవత్సరం (3)
35. కైవల్యం (2)

నిలువు

1. బలము (3)
2. చీకటి (3)
3. అన్నం వార్చిన నీరు (2)
4. గాలి పటం (3)
5. నీట బుట్టిన కమలం (3)
6. ఆభరణాలు (3)
10. సంప్రదింపులు (4)
12. అలవాటు, సంప్రదాయం (3)
13. నొసలు, ఫోర్‌హెడ్ (3)
15. తెలుగు టేస్ట్ (2)
16. క్రింద నుంచి యాస మాటలో ప్రాణం (2)
17. రచ్చ, గలభా (3)
18. రాజు భార్య (2)
19. నూనె మిల్లు (3)
21. తోక (3)
22. అద్దె, రెంట్ (3)
23. వీవింగ్ పని (4)
24. ప్రయాణం, తేలికగా (3)
25. ఎడమ భాగం కమ్యూనిజం (4)
26. ప్రపంచంలో (3)
27. క్రింద నుంచి తలగుడ్డ (2)
30. నటుడు కాదు క్రింద నుంచి (2)
32. క్రింద నుంచి బరువు (2)

సమాధానాలు

పదరంగం -82

1సు	నా	2యా	సం		3ర	4వ	ళి		5క
ర		మి		6వం	తె	న		7లు	మే
ళి		8ని	9రా	శ		10రు	11సు	ము	
	12శా		13చ	పా	తి		14కృ	పా	15ణం
16గో	తం		17న	రం		18గ	తం		వ
ధూ			19గ	గా	20రి	న్		21త	ల
22ళి	23వ		రు		క్షా		24ము	మో	
25వే	స	26వి		27తో		28వి	సు	గు	
ళ		29న	30ల	క			31గు	ణ	32కం
	33అ	తి	వ			34ళ్ళు	లో	ము	పా

● సామాన్య ప్రజలతో...

ఆత్మీయ బంధం ఏర్పర్చుకొన్న వెంకయ్యస్వామి!

గొలగమూడి వెంకయ్యస్వామి సచ్చరిత్రకు పరిచయ వాక్యాలు రాస్తూ వాడ్రేవు చిన వీరభద్రుడు "ఈ జీవిత చరిత్రను నేను కన్నీళ్లతో చదివాను. చదివినంత సేపూ నా హృదయం మెత్తబడుతూ, నాలోని మాలిన్యాలు అడుగంటుతూ, నా మనస్సు తేటపడుతున్నట్లుగా అనుభూతి చెందాను" అన్నారు. ఆయన 'వాగ్దానం' ఒట్టిమాట కాదు. ఈ పుస్తకం చదువుతున్నంత సేపూ ఈ సమీక్షకుడు కూడా అటువంటి అనుభూతినే పొందాడు. "నిజంగానే వెంకయ్య స్వామి అనే మహాత్ముడు ఈ భూమి మీద నడయాడాడా? ఆయన పాదముద్రలతో ఈ పుడమి పునీతమైందా" అని ఈ పుస్తకం చదివి ముగించిన తర్వాత పాఠకులు ఆనందాశ్రువులతో అనుకోక తప్పదు.

చాలాకాలం క్రిందట గొలగమూడి వెంకయ్య స్వామి జీవిత చరిత్ర చిన్న పుస్తకం ఒకటి చదివాను. ఇప్పుడు గొప్ప నిబద్ధతతో స్వామి భక్తులు అల్లు భాస్కర్‌రెడ్డి, ఆయన కుమార్తె కోడూరు ఇందిరమ్మ ప్రామాణికంగా రూపొందించిన "శ్రీ స్వామి సచ్చరిత్ర" చదివి ఈ ప్రయత్నాన్ని మనసారా అభినందించకుండా ఉండలేక పోతున్నాను.

ఈ రచన తలపెట్టేందుకు ముందు, సుశిక్షితులైన యువజనాన్ని పల్లెలకు పంపి స్వామిని ప్రత్యక్షంగా చూసిన వారి, స్వామి భక్తుల అనుభవాలను సేకరించి, ఆ సమాచారం మీద ఆధారపడి ఈ రచయితలు గ్రంథ రచన చేశారు. వెంకయ్య స్వామి జననం నుంచి, మహాసమాధి వరకు అనేకానేక సంఘటనలు, భక్తుల అనుభవాలు ఈ గ్రంథంలో ఆసక్తికరంగా వివరించబడ్డాయి. మనందరి నడుమ రక్తమాంసాలతో జీవించిన వెంకయ్య స్వామే అయినా, ఆయన సాధుజీవనంలోని అనేక పార్శ్వాలు మనందరికి తెలియని అద్భుత విషయాలు ఈ రచనలో చేర్చబడ్డాయి. పెన్నానదికి పడమరగా ఉన్న మెట్ట ప్రాంతంలోని నాగులవెల్లటూరులో మొదలయిన స్వామి మహా ప్రస్థానం గొలగమూడిలో మహాసమాధి పర్యంతం ఈ రచనలో అద్భుతంగా వర్ణించబడింది.

సాధకులుగా స్వామి గడిపిన జీవిత పర్వాన్ని ఈ రచయితలు ఒక 'దివ్యోన్మాదం'గా అభివర్ణించారు. స్వామి గురువెవరో మనకు తెలియదు. స్వామి తన అనుభవాలను తరచు ప్రతీకాత్మకంగా వివరించేవారు. ఆయన ప్రజల 'ప్రశ్న'లకు సమాధానాలు చెప్పినా, అనేక ప్రతీకలతో నిండి ఉండేవి. ఆ రోజుల్లో ఆయన అనుచరులే స్వామి మాటలను వ్యాఖ్యానించేవారు. స్వామి సందేశాన్ని పరిపూర్ణంగా గ్రహించిన వారెందరో?

పుస్తకసమీక్ష

శ్రీ స్వామి సచ్చరిత్ర

భగవాన్ వెంకయ్య స్వామి జీవిత చరిత్ర

రచన : **అల్లు భాస్కర్‌రెడ్డి, కోడూరు ఇందిరమ్మ**

సమీక్షకుడు: **డాక్టర్ కాళిదాసు పురుషోత్తం**

పేజీలు : **331** వెల : **100/-**

ప్రతులకు

సన్నిధి ప్రచురణలు, 27-1-1465, ఆదిత్యనగర్, నెల్లూరు.

వెంకయ్యస్వామి సాధక దశ నుంచి ఒక యోగిగా పరిణిత దశకు చెందిన తర్వాత "లోక సంచారం మొదలు పెట్టింది మాత్రం మద్రాసు హైకోర్టు మెట్లపైనుంచి" ఆ తర్వాతనే ఆయన అన్ని వేళలా తనున్న ప్రదేశంలో ఒక అగ్ని గుండాన్ని వెలిగించడం ఆరంభించారు. స్వామి అనేక విచిత్ర చర్యలను ఈ రచయితలు వ్యాఖ్యానించి వివరించారు. "స్వామి మాటల్లో భవిష్యత్తు సూచన, దాని వెనుక హాస్యంతో కూడిన చిన్న పరిహాసం" కూడా ఉండేవట!

శ్రీ స్వామి దివ్యచరిత్ర చదివిన తర్వాత ఆయన ఆచరణే ఆయన సందేశంగా తోచింది. స్వామి ఈ సమాజంలోని అనేక కట్టుబాట్లను, సంప్రదాయాలను, అడ్డుగోడలను ఆచరణ ద్వారా తిరస్కరించి, గ్రామీణ ప్రజలకు, మరీ పేద ప్రజలకు చేరువయ్యారు. గ్రామీణ ప్రజల కష్టాలను, కన్నీళ్లను తనదైన రీతిలో పోగొట్టి ఊరట ఇవ్వడానికి ప్రయత్నం చేశారు. ఆయన సామాన్య ప్రజలతో అనితర సాధ్యమైన ఒక ఆత్మీయ స్నేహ సంబంధాన్ని నెలకొల్పుకోగలిగినట్లు అనిపిస్తుంది. స్వామి ప్రకృతిలోని సమస్త ప్రాణికోటిని సమదృష్టితో చూశారు. విష సర్పాల నుంచి నోరు లేని మూగ జీవాల వరకు జీవ కారుణ్య దృష్టితో చూశారు.

ఈ రచనలో వెంకయ్యస్వామి ప్రేమకు పాత్రులైన అనేకుల ప్రస్తావనలున్నాయి. స్వామి పాదస్పర్శతో పునీతమైన ఎన్నో పల్లెల ప్రస్తావన వుంది. ఈ పుస్తకం రాబోయే కాలంలో అనేక ముద్రణలకు నోచుకోనుంది. తెలుగు భాష వచ్చిన వారందరూ చదువుతారు. వాళ్లలో కొందరైనా, ఆయా వ్యక్తుల వివరాలు, ప్రదేశాలు ఎక్కడ ఉన్నది తెలుసుకోవాలనుకొంటారు. తులశమ్మగారి వంటి భక్తులు తమ జీవితాలనే స్వామికి అర్పించారు. అటువంటి భక్తుల ప్రస్తావన ఈ గ్రంథంలో తరచుగా వస్తుంది. ఆ సమాచారమంతా ఒకచోటే ఇవ్వడమో, అనుబంధంతో సంగ్రహంగా ఇవ్వడమో చేస్తే బాగుండుననిపించింది. అనుబంధంలో స్వామి జీవితంలో ముఖ్యమైన సంవత్సరాలు, ఆయన పర్యటించిన ప్రదేశాలను గుర్తించిన మ్యాప్ ఒకటి చేరిస్తే సౌకర్యంగా వుంటుంది. ఇవి పాఠకుల సౌకర్యం కోసమేగానీ, ఈ భోగట్టా లేకపోవడం ఈ సచ్చరిత్రకు వెలితేమీలేదు. ఇంత మంచి భాషలో, సరళంగా, ఆసక్తికరంగా, అంకితభావంతో స్వామి చరిత్రను గ్రంథస్తం చేసిన ఈ రచయితలను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నాను.



రైతు లోకం

వయ్యారిభామను అదుపు చేయడమిలా!

వయ్యారిభామ (పార్థీనియం) ఒక హానికరమైన సమస్యాత్మక కలుపు మొక్క. దీనిని కాంగ్రెస్ గడ్డి, క్యారట్ గడ్డి, నక్షత్ర గడ్డి అని కూడా పిలుస్తారు. మన రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాలలోనూ ఇది చాలా విస్తారంగా కనిపిస్తుంది. పంట పొలాలలోనూ, బంజరు భూములలోనూ, జనావాసాలలోనూ, రోడ్ల ప్రక్కన, కాల్వగట్ల మీద, పొలం గట్ల మీద, సేద్యం చేయని పొలాలలోనూ పెరుగుతుంది.

పార్థీనియం ఒక ఏకవార్షిక మొక్క. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా వుంటే ఇది నాలుగు వారాలలో పుష్పించే దశకు చేరుకుంటుంది. దీని పుష్పాలు తెల్లగా వుంటాయి. అధిక విత్తనోత్పత్తి, సమర్థవంతమైన విత్తన వ్యాప్తి, ఇతర మొక్కలపైన రసాయనాల ప్రభావం, కొన్ని రకాల రసాయనాలు మొక్కలలో వుండడం వల్ల జంతువులు తినలేకపోవడం, అన్నిరకాల వాతావరణ పరిస్థితులను తట్టుకొనగలిగే అంతర్గత వ్యవస్థ మొదలైన కారణాలు పార్థీనియం మొక్క ఇంతగా విస్తరించడానికి దోహద పడుతుంది.

పార్థీనియం వల్ల నష్టాలు: పార్థీనియం మొక్క మానవులకు, జంతువులకు మరియు మొక్కలకు హాని కలుగజేస్తుంది. పంట పొలాలలో 40శాతం దిగుబడిని, పశుగ్రాస పంటలలో 90శాతం దిగుబడిని తగ్గిస్తుంది. ఈ మొక్క వేర్ల నుండి స్రవించబడే కొన్ని రసాయనాలు పైరు మొక్కలను పెరగనీయక దిగుబడిని తగ్గిస్తాయి. పార్థీనియం ఉత్పత్తి చేసే పుప్పొడి టమోటా, వంగ, మిరప మరియు మొక్కజొన్న పుష్పాలపై పడినప్పుడు వాటిలో ఫలోత్పత్తి నిరోధించబడుతుంది. పార్థీనియం వల్ల మనుషులకు డెర్మాటైటిస్, ఉబ్బసం మరియు బ్రాంకైటిస్ లాంటి వ్యాధులు వస్తాయి. ఆకులు చర్మానికి రాసుకుంటే తామర వంటివ్యాధి సంభవిస్తుంది. పశువులలో వెంట్రుకలు రాలిపోవటం, అధిక ఒత్తిడికి గురికావడం జరుగుతుంది.

డాక్టర్ కె.పుల్లంరాజు
కోఆర్డినేటర్,
ఏరువాక (డాట్ సెంటర్), నెల్లూరు.

యాజమాన్యం: పార్థీనియంను పూత రాక ముందే పీకివేసి తగులబెట్టడం లేదా కంపోస్ట్ తయారు చేయడం కాని చేయవలెను. పూతకు వచ్చిన తర్వాత పీకినట్లయితే, పీకిన మొక్కలను వెంటనే తగులబెట్టి విత్తన వ్యాప్తిని నిరోధించాలి. పంట మార్పిడి పాటించాలి. బంతితో పంట మార్పిడి చేస్తే తర్వాత వేసే పైరులో పార్థీనియం ఉధృతి తక్కువగా వుంటుంది. రసాయనిక పద్ధతి ద్వారా కలుపు మొక్కల పెరుగుదలను తాత్కాలికంగా మాత్రమే నిరోధించగలం. అంతే కాకుండా రసాయనాలు వాడడం వల్ల పరిసరాలలో కాలుష్యం పెరుగుతుంది.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/12-14

కిరణ్ సాహసానికి చరిత్రలో స్థానం!



ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అంటే ఎవరికీ గొప్ప అభిప్రాయాలు లేవు. పెద్ద అంచనాలు లేవు. ఆయన్ను ఒక నేతగా గుర్తించడానికి మంత్రులకే చాలా కాలం పట్టింది. రాజకీయ అనుభవం లేదు. ఎప్పుడూ ఏ ప్రజా ఉద్యమంలో కానీ, ప్రజోపయోగ కార్యక్రమంలో కానీ, కనీసం పార్టీ మేలు కోసం చేసిన కృషి కానీ లేవు. తన నియోజకవర్గం దాటి ఆయన స్థాయి పెరగలేదు. జిల్లాలో కూడా నాయకత్వం లేదు. ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లాకు వెళ్తేనే సగం మంది స్వంత పార్టీ ఎమ్మెల్యేలు పలకరింపుకు రాలేదు. ఎక్కడో సుడి వుండి, ఏదో అదృష్టం తన్నుకవచ్చి ముఖ్యమంత్రి అయిపోయాడు. ఆ పదవిలో రాణింపు అంటూ చెప్పుకోవడానికి ఇంతవరకు లేదు. కానీ సమైక్యాంధ్ర ఉద్యమం ఆయన్ను ఒక్కసారిగా నాయకుడిని చేసింది. ఎక్కడలేని పెద్దరికం ఆపాదింప జేసింది. ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నవాడు రెండు ప్రాంతాల ప్రజల మనోభావాల పట్ల సమన్యాయంతో వ్యవహరించాలి. కానీ కిరణ్‌కుమార్‌రెడ్డి సమైక్యవాదుల పక్షంగా నిలబడిపోయాడు. తన పక్షపాతాన్ని ఏ మాత్రం దాచుకోవడం లేదు. కాంగ్రెస్‌వాదిగా వున్నవాడు అధిష్టానం అభిమతాన్ని తుచ తప్పకుండా పాటించాలి. కానీ కిరణ్‌కుమార్‌రెడ్డి సోనియాకు కోపం వస్తున్నదని తెలిసి కూడా ధిక్కారం చూపుతున్నాడు. విరుద్ధంగా నడుస్తున్నాడు. మర్రి చెన్నారెడ్డి వంటి ప్రజా నేత కూడా ఆ సాహసం చేయలేదు. బెదరించడం, బేరమాడి రాజీ పడడమే ఇప్పటి వరకు కాంగ్రెస్ అగ్రనేతల వ్యవహారశైలి. మరీ తాడు తెగేదాకా వస్తే పార్టీ వదలి పోయేవారే తప్ప అధిష్టానాన్ని కాదని పార్టీలో కొనసాగిన వాడు లేడు. కిరణ్ అందుకు విరుద్ధంగా కాంగ్రెస్‌లో వుంటూనే, ముఖ్యమంత్రి కుర్చీ వదలకుండానే సమైక్యాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నాడు.

కిరణ్ అనేవాడు లేకుంటే ఈ ఉద్యమమే లేదనడం అతిశయోక్తి కాదు. ఉద్యోగులు వీధులలోకి వచ్చిన తర్వాతనే ఆ వివాదం జనంలోకి వెళ్లింది. ఉద్యోగుల వెన్ను తట్టి, నేనున్నానని చెప్పి ముగ్గులోకి దించింది ముఖ్యమంత్రి అన్నది జగమెరిగిన సత్యం. అది లక్ష గళ ఘోష కానీ, శాంతి ప్రదర్శన కానీ, ఇంకొకటి కానీ ఆంధ్రలో ఏ వూరిలో ఉద్యమం కార్యక్రమం జరిగినా కన్పడుతున్న "జనం" పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు మాత్రమే. యూనిఫాం వేసుకొన్న విద్యార్థీ విద్యార్థులు వేల సంఖ్యలో కన్పిస్తున్నారు. సాధారణంగా అయితే ఏ ప్రైవేటు పాఠశాల కూడా ఇటువంటి ఆందోళనలలోకి తమ పిల్లలను పంపడానికి ఇష్టపడదు. తల్లిదండ్రులూ అంగీకరించారు. కానీ అడిషనల్ జాయింట్ కలెక్టర్, డిఆర్వో, డిఇఓ స్థాయి అధికారులు ప్రతి జిల్లాలో ప్రైవేటు స్కూళ్ల యజమానులను పిలిచి, ఏ రోజు ఎంత మంది పిల్లలను తీసుకరావాలో లక్ష్యాలు విధిస్తుండడంతో వారు కూడా ఉత్సాహంగా ఉద్యమంలో పాలుపంచుకొంటున్నారు. అందుకు కారణం కిరణ్‌కుమార్‌రెడ్డి జిల్లా అధికారులకు ఇస్తున్న పరోక్ష సంకేతాలు.

తెలంగాణ ఉద్యమంలో పోలీసుకు, ఉద్యమకారులకు అడుగడుగునా గొడవే. ఏ చిన్న కార్యక్రమం పెట్టుకొన్నా పోలీసు వేధించేది. అరెస్టు చేసేది.. నిర్భంధం విధించేది. కానీ ఆంధ్రలో జరిగే ఉద్యమానికి పోలీసు ప్రత్యక్షంగా సహకారం అందిస్తున్నది. అనుమతి గినుమతి లేకుండా ఎవరు పడితే వారు వీధులను ఆక్రమించి, ట్రాఫిక్ నిలిపివేసి, జనాన్ని క్షోభ పెడుతున్నా ఒక్క పోలీసు అధికారి కూడా అభ్యంతరం చెప్పడం లేదు. అనుమతులు లేకుండా ఎన్ని సభలు జరుగుతున్నా అడ్డం రావడం లేదు. విగ్రహాలు కూలగొట్టినా కేసులు పెట్టలేదు. అందుకు కారణం కూడా ముఖ్యమంత్రి సానుకూల వైఖరి మాత్రమే.

మొత్తం మీద 13 జిల్లాలలో ఉద్యమాన్ని నిశ్శబ్దంగా ఉధృతం చేయడంలో కిరణ్‌కుమార్‌రెడ్డి కీలక పాత్ర పోషిస్తున్నాడు. అటు ఢిల్లీలో కూడా వెరపు, విరామం కూడా లేకుండా రాష్ట్ర విభజనను వ్యతిరేకిస్తూ వాదనలు విన్పిస్తున్నాడు. ఎమ్మెల్యేలు, మంత్రులలో నైతిక సామర్థ్యం తగ్గకుండా నిలబెడుతున్నాడు. ఇందులో గొప్ప ఏమిటంటే, ఎక్కడా తన పాత్ర, ప్రమేయం మీద ప్రత్యక్ష వివాదం తలెత్తకుండా గోప్యత పాటించడం. సాధారణంగా ఒక ప్రజా ఉద్యమానికి నాయకత్వం వహించేవాడు తనను పది మందీ గుర్తించాలని, అందరూ తన వెనకే నడవాలని కోరుకొంటాడు. కానీ ముఖ్యమంత్రి కుర్చీని అంటిపెట్టుకొని వుండే పరిమితులు, సహజంగా తన కుండే సిగ్గు బిడియాల వల్ల కావచ్చు – కిరణ్‌కుమార్‌రెడ్డి మాత్రం తన పేరు ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడుతున్నాడే తప్ప నాయకత్వాన్ని ఆశించడం లేదు. చాలా గొప్ప విషయం ఇది.

రాష్ట్రం సమైక్యంగా వుండాలన్నది కిరణ్‌కుమార్‌రెడ్డి కోరిక. అందుకు కారణం ఏదైనా కావచ్చు. కానీ తాను నమ్మిన విధానానికి నిబద్ధత చూపడం మాత్రం మెచ్చుకోదగిన నాయకత్వ లక్షణం. ఢిల్లీ పెద్దలు కిరణ్ ప్రతిఘటన వల్ల కానీ, ఆంధ్ర ప్రాంత ప్రజల తీవ్ర భావోద్వేగాలను గౌరవించి కానీ విభజన నిర్ణయాన్ని వాయిదా వేస్తే మాత్రం, ఆ ఘనత కిరణ్‌కుమార్‌రెడ్డికే దక్కుతుంది. చరిత్రలో రాష్ట్రం విడి పోకుండా చూసిన నాయకుడిగా ఆయనకు చిరస్థానం లభిస్తుంది.

N.B.K.R.
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
(AUTONOMOUS)
Established 1979
VIDYANAGAR - 524 413, SPSR Nellore Dt., A.P :: Website : www.nbkrist.org



Affiliated to JNTU Anantapur w.e.f. 2013-14

Courses offered: ECE, CSE, EEE, Mech. & Civil

Tuition Fee : Rs.54,000/- Prescribed by the Government.

- College Bus facility from Nellore, Gudur & Naidupeta.
- Fee Concession for Merit students

EAMCET RANK	TUITION FEE
1 – 10,000	35,000 /-
10,000 – 20,000	50,000 /-

EAMCET CODE NBKR

- All Faculty Members possess PhD /PG Degrees
- Year-wise separate Hostel facility is provided
- Newly constructed Hostel is provided exclusively for 1st year students
- Well protected enclosed hostel for girls
- 100% Ragging- Free environment
- Accredited by NBA, NAAC (UGC) with 'A' Grade.
- Only Institute with185 Acres of tranquil Campus in the entire S.V.U. Region
- 14 Acres exclusively for Indoor & Outdoor games
- Academic partner of Infosys Campus connect programme.
- Placement-oriented Soft skills & Training Programme from 2nd year onwards
- 100 % back- up Power generators with 600 KVA
- Digital Library – Access to International Journals
- Wi-Fi enabled Campus

for more details contact : Dr. C. Raveendra Reddy 94415 72755



Dr. I. Gopal Reddy
Former VC, JNTU
Chairman



Nedurumalli Ram Kumar
Correspondent



Dr. V.Vijaya Kumar Reddy
Director

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore. E-mail : jaminryot@yahoo.com